విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందిరి హక్కు...

PEN SATTA Telugu Daily

సంపుటి : 4 | సంచిక :108 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | ఆదివారం 6 సెప్టెంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




## మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా
# 'ఏపీ మోడల్'

- 2029లోగా మరో 3 డీఎస్సీలు: మంత్రి లోకేశ్
- పిల్లల జీవితాలను మార్చే శక్తి టీచర్లకే ఉంది
- వారి మానసిక ఎదుగుదలపై దృష్టి సారించాలి
- ప్రవర్తనలో మార్పులను జాగ్రత్తగా గమనించాలి
- ప్రభుత్వ బదులకు హౌస్‌ఫుల్, నో అడ్మిషన్ బోర్డులు ఉండాలి



**అమరావతి**

డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియనివారు తమపై విమర్శలు చేస్తున్నారని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. విజయవాడలోని 'ఎ' కన్వెన్షన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవంలో మంత్రి నారా లోకేశ్? పాల్గొన్నారు. తొలుత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడారు. 2029లోగా మరో 3 డీఎస్సీలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. విద్యాశాఖలో ఏపీ మోడల్ మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా తీర్చిదిద్దుతామని అన్నారు. రాష్ట్ర విద్యా వ్యవస్థలో సంస్కరణలు తెచ్చేందుకు కట్టుబడి ఉన్నామని లోకేశ్ చెప్పారు. 'కాయలున్న చెట్టుకే రాళ్లదెబ్బలు తగులుతాయి. 14 డీఎస్సీలు వేసిన వ్యక్తి సీఎం చంద్రబాబు.



## డ్రగ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

- 'మొబైల్ వినియోగానికి క్రీడలే పరిష్కారం'
- 'విద్యార్థుల్లో డ్రగ్స్, స్క్రీన్ టైం విషయంలో అప్రమత్తంగా ఉండాలి'
- ఉపాధ్యాయులకు ప్రధాని మోదీ సూచన
- విద్యార్థుల్లో మాదకద్రవ్యాల వినియోగంపై ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని ప్రధాని మోదీ సూచన
- పిల్లలు మొబైల్ ఫోన్లకు బానిస కాకుండా క్రీడల వైపు మళ్లించాలని పిలుపు

## పే-రివిజన్ కమిషన్ నియామకానికీ
# గ్రీన్ సిగ్నల్

- 2 పెండింగ్ డీఏలను విడుదలకు ఓకే..
- ఈహెచ్ఎస్ స్ట్రీమ్ లైన్... 2022 ఏడాది సరెండర్ లీవుల విడుదల
- ఆర్థిక ఇబ్బందులున్నా ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తున్నాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి**

ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 12వ పే--రివిజన్ కమిషన్ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. అలాగే పెండింగులో ఉన్న 4 డీఏల్లో 2 డీఏల విడుదలకు ముఖ్యమంత్రి అంగీకరించారు. వీటితో పాటు మరికొన్ని ముఖ్యమైన పెండింగ్ అంశాలకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో శనివారం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని ఉద్యోగ సంఘాల నేతలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. గత ప్రభుత్వం పెండింగులో పెట్టిన ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ప్రస్తుతం రాష్ట్రం ఆర్థికంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. రాష్ట్ర ఆదాయ--వ్యయాల లెక్కలను ఉద్యోగుల ముందు ఉంచారు. రాష్ట్రం ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నా... ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలతతో ఉన్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ మేరకు కొన్ని కీలక నిర్ణయాలను సీఎం ప్రకటించారు. 12వ పీఆర్సీ నియామకానికి అంగీకరించారు. అలాగే 1--7--2024, 1--1--2025లకు చెందిన రెండు.




## ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో కీలక మార్పులు

- పలు రాష్ట్రాలకు కొత్త ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌ల నియామకం
- పలు రాష్ట్రాలకు కొత్త ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌లను నియమించిన కాంగ్రెస్ అధిష్ఠానం
- ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల బాధ్యులుగా పీవీ మోహన్ నియామకం
- ఆదేశాలు జారీ చేసిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్



## అసెంబ్లీ ఎన్నికల వేళ 4 రాష్ట్రాల్లో జనగణన


- ఈ డిసెంబర్ 1 నుంచే షురూ!
- ఉత్తరాఖండ్, గోవా, ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్‌లో జనగణన షెడ్యూల్ రిలీజ్
- 2026 డిసెంబర్ 1 నుంచి 2027 జనవరి 4 వరకు నిర్వహణ
- వచ్చే ఏడాదే 4 రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు



## మీడియా రంగం విశ్వసనీయత కోల్పోతోంది

- నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు
- ప్రజాస్వామ్యానికి మీడియా, న్యాయవ్యవస్థ కీలకం
- మీడియా రంగంలో విశ్వసనీయత సంక్షోభం సమస్య మరింత తీవ్రమైంది
- ప్రజాస్వామ్య పురోగతికి స్వతంత్ర మీడియా ఎంతో ముఖ్యం
- ప్రజలు, సమాజం కోసం పనిచేస్తే క్రెడిబిలిటీ తిరిగి సాధించొచ్చని సూచనలు

## పెండింగ్ కేసుల పరిష్కారంపై
# ప్రత్యేక దృష్టి



- ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీ కేసుల్లో వేగంగా విచారణ
- ఎస్సీ, ఎస్టీ హైపవర్ కమిటీ సమావేశంలో సీఎం చంద్రబాబు
- పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా కోర్టుల్లో పరిష్కరించేలా చూడాలి
- ప్రత్యేక సెషన్ కోర్టులు, స్పెషల్ కోర్టుల్లో కేసులను రేషనలైజ్ చేసి పరిష్కరించాలి
- చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా, తప్పు చేసిన వారికి శిక్షపడేలా వ్యవస్థ పనిచేయాలని స్పష్టం

**అమరావతి**

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి విచారణ వేగంగా జరిపి నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పెండిం గ్‌లో ఉన్న కేసులను త్వరగా కోర్టుల్లో పరిష్కరించేలా చూడాలని, ప్రత్యేక సెషన్ కోర్టులు, స్పెషల్ కోర్టుల్లో కేసులను రేషనలైజ్ చేసి పరిష్కరించాలని సీఎం సూచించారు. చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా, తప్పు చేసిన వారికి శిక్షపడేలా వ్యవస్థ పనిచేయాలని స్పష్టం చేశారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం అమలు, సంక్షేమంపై రాష్ట్రస్థాయి అత్యున్నత కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీల రక్షణ, సంక్షేమం, విద్య, ఉపాధి, ఆర్థిక సాధికారత, వైద్యారోగ్యం తదితర అంశాలపై సీఎం కీలక సూచనలు చేశారు.




## ఏపీలో జిల్లా పరిషత్‌ల
# పునర్వ్యవస్థీకరణ

- ఇక 28 జడ్పీలు – ఉత్తర్వులు జారీ
- కొత్త జిల్లాల సంఖ్యకు అనుగుణంగా జిల్లా పరిషత్‌ల పునర్వ్యవస్థీకరణ
- ప్రస్తుతం ఉన్న 13 జడ్పీల స్థానంలో 28 కొత్త జడ్పీలు ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు మార్కాపురం, పోలవరం జిల్లాలకు సైతం జడ్పీల మంజూరు
- కొత్త జిల్లాల సంఖ్యకు అనుగుణంగా జిల్లా పరిషత్‌ల పునర్వ్యవస్థీకరణ

**అమరావతి**

రాష్ట్రంలో పాలనా వికేంద్రీకరణలో భాగంగా పెరిగిన జిల్లాల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వం జిల్లా ప్రజా పరిషత్‌లను పునర్వ్యవస్థీకరించింది. ప్రస్తుతం ఉన్న 13 జెడ్పీల స్థానంలో, కొత్తగా 28 జిల్లా ప్రజా పరిషత్‌లను ఏర్పాటు చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు. 2025 నవంబర్‌లో వివరాలు 2లో..

# ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో కీలక మార్పులు

సంస్థాగతంగా మరింత బలోపేతం అయ్యేందుకు కాంగ్రెస్ పార్టీ కీలక మార్పులు చేసింది. దేశంలోని పలు రాష్ట్రాలకు కొత్త ఏఐసీసీ (ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ) ఇన్‌ఛార్జ్‌లను నియమించింది. ఆంధ్రప్రదేశ్ ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌గా పీవీ మోహన్‌ను కాంగ్రెస్ అధిష్టానం నియమించింది. మాణికం ఠాకూర్ తమిళనాడుకు వెళ్లడంతో ఆంధ్రప్రదేశ్ ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ పదవి ఖాళీ అయింది. దీంతో ఆ స్థానంలో మోహన్‌ను ఎంపిక చేసింది. మరోవైపు వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న పంజాబ్ రాష్ట్రానికి కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ జనరల్ సెక్రటరీగా రాజస్థాన్ కాంగ్రెస్ నాయకుడు సచిన్ పైలట్‌ను నియమించింది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ ఆదేశాలు జారీ చేశారు. కొత్త నియామకాలు తక్షణమే అమల్లోకి వచ్చేలా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నియమించారని స్పష్టం చేశారు. ఇదే సమయంలో ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ వ్యవహారాల బాధ్యులుగా సుఖ్‌దేవ్ భగత్‌ను ఎంపిక చేశారు. మరికొందరిని ఇటీవల కాలంలో పార్టీ బాధ్యులుగా నియమించినట్లు కాంగ్రెస్ ప్రకటనలో పేర్కొంది. పంజాబ్ రాష్ట్రంలో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా ఇక్కడ కాంగ్రెస్ ఎక్కువ ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. పంజాబ్ శాసనసభ గడువు 2027 మార్చి 16తో ముగియనుండగా, ఆలోపే అంటే వచ్చే ఏడాది ప్రారంభంలోనే ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. దీంతో ముందుగానే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని పుంజుకునేలా చేసేందుకు, వ్యూహాలు రచించడానికి సీనియర్ నేత సచిన్ పైలట్‌ను ఏఐసీసీ వ్యవహారాల బాధ్యులుగా నియమించింది. ప్రస్తుతం పంజాబ్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌గా ఉన్న ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్‌కు ఉద్వాసన ఎదురైంది. ఇప్పుడు సచిన్ పైలట్ పంజాబ్ కాంగ్రెస్ బాధ్యతలు చూసుకోనుండగా, బఘేల్‌ను అసోం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్‌గా నియమించింది. సచిన్ పైలట్ విషయానికి వస్తే ఈయన పార్టీలో కీలక నాయకుల్లో ఒకరు. గతంలో రాజస్థాన్‌కు ఉపముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం ఉంది. ఇంకా రాజస్థాన్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా కూడా ఉన్నారు. వివిధ మంత్రిత్వ శాఖల్లో పనిచేశారు. ప్రస్తుతం పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలో ఉంది.



మరోవైపు గుజరాత్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ జనరల్ సెక్రటరీగా సీనియర్ నాయకుడు రణదీప్ సింగ్ సుర్జేవాలాను పార్టీ నియమించింది. గుజరాత్‌లో వచ్చే ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడ దాదాపు 30 ఏళ్లుగా కాంగ్రెస్ అధికారానికి దూరంగా ఉంది. ఇక్కడ తిరిగి పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ఆయన కృషి చేయాల్సి ఉంటుంది. ఇటీవలే అధికార మార్పిడి జరిగిన కర్ణాటకలోనూ ఏఐసీసీ వ్యవహారాల బాధ్యతలను రణదీప్ సుర్జేవాలా చూసుకోనున్నారు. సిరివెల్ల ప్రసాద్‌ను మహారాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. ఇక ఇప్పటివరకు పార్టీ జనరల్ సెక్రటరీ/ఇన్‌ఛార్జ్‌లుగా పనిచేసి, బాధ్యతల నుంచి తప్పుకుంటున్న జితేంద్ర సింగ్, రమేశ్ చెన్నితాల, మాణికం ఠాకూర్‌ల సేవలను పార్టీ అభినందిస్తోందని వేణుగోపాల్ అన్నారు. మరోవైపు ఏఐసీసీ జనరల్ సెక్రటరీగా ముకుల్ వాస్నిక్ కొనసాగుతారని ప్రకటనలో కాంగ్రెస్ పేర్కొంది.

**కొత్త ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌లు వీరే**

ఆంధ్రప్రదేశ్- పీవీ మోహన్
పంజాబ్- సచిన్ పైలట్
అసోం- భూపేశ్ బఘేల్ (ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి)
మహారాష్ట్ర- సిరివెల్ల ప్రసాద్
గుజరాత్- రణ్‌దీప్ సుర్జేవాలా
ఉత్తర్‌ప్రదేశ్- రాజేంద్ర పాల్ గౌతమ్
హరియాణా- సంజయ్ దత్ (2026 జూన్‌లో నియామకం)
ఒడిశా- లాల్జీ దేశాయ్ (2026 జూన్‌లోనే నియామకం)
తమిళనాడు- గులామ్ అహ్మద్ మీర్ (2026 జులైలో నియామకం)
బంగాల్- ప్రకాశ్ జోషి (2026 జులైలో నియామకం)

రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సహా అదే విధంగా ఆయా రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ అధిష్టానం సంస్థాగతంగా మార్పులు చేస్తున్నట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు. పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడం సహా పార్టీ కేడర్‌ను సమన్వయం చేయడం, ఆయా రాష్ట్రాల నాయకత్వంతో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను దూకుడుగా ముందుకు తీసుకెళ్లడం, ఎన్నికల వేళ వ్యూహాల్ని అమలు చేయడం వంటి పలు అంశాలపై పార్టీ ఇన్‌ఛార్జ్‌లు దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

# అసెంబ్లీ ఎన్నికల వేళ 4 రాష్ట్రాల్లో జనగణన

కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది ఉత్తరాఖండ్, పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్, గోవాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఈ రాష్ట్రాల్లో జనగణన ప్రక్రియను కాస్త ముందుగానే నిర్వహించాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి తాజాగా షెడ్యూల్ విడుదల చేసింది. ఈ ఏడాది డిసెంబర్ 1న జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఇది వచ్చే ఏడాది అంటే 2027 జనవరి 4 వరకు కొనసాగుతుంది. ఈ జనాభా గణనకు సంబంధించిన వివరాల్ని భారత రిజిస్ట్రార్ జనరల్ (=+× - రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా), సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ తాజాగా విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ 4 రాష్ట్రాల్లోని ప్రజలు ముందుగానే వారి వివరాల్ని నమోదు చేసుకునేందుకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) సౌకర్యాన్ని కల్పించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ స్వీయ గణన ఆప్షన్ జనగణన అధికారిక ప్రక్రియ ప్రారంభమయ్యే ముందు 15 రోజులు అంటే 2026 నవంబర్ 16 నుంచి 30వ తేదీ వరకు అవకాశం ఉంటుందని నారాయణ్ తెలిపారు. 2027 జనవరి 5 నుంచి 9 వరకు దీనికి సంబంధించి రివిజనల్ రౌండ్ నిర్వహిస్తామన్నారు. ఈ రివిజనల్ రౌండ్‌లో సవరణలకు అవకాశం ఉంటుందన్నమాట. ఇక్కడ అవసరమైన మార్పులు లేదా ధ్రువీకరణ ప్రక్రియలు వంటివి నిర్వహించే అవకాశం ఉంటుంది. ఉత్తరాఖండ్‌లో మంచుతో కప్పి ఉండే ప్రాంతాల్లో మాత్రం పైన షెడ్యూల్ ప్రకారం జన గణన ప్రక్రియ ఉండదని నారాయణ్ స్పష్టం చేశారు.

ఈ నోటిఫికేషన్ ప్రకారం ఉత్తరాఖండ్ మంచు ప్రాంతాలు మినహా ఈ నాలుగు రాష్ట్రాల్లో 2027 జనగణనకు (సెన్సస్ 2027) రిఫరెన్స్ డేట్‌గా 2027, జనవరి 5 అర్ధరాత్రి 12 గంటలుగా (00:00 ఎతీం) నిర్ణయించారు. అంటే ఈ తేదీ, సమయాలను ప్రామాణికంగా తీసుకొని ఆ లోపే జనగణన ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. మరోవైపు లద్దాఖ్ సహా మంచుతో కప్పి ఉండి రవాణాకు అనుకూలించని జమ్ముకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతం, అలాగే మంచుతో కప్పబడి ఉండే హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని కొన్ని ప్రాంతాలకు జనగణనకు రిఫరెన్స్ డేట్‌ను 2026, అక్టోబర్ 1 గా నిర్ణయించారు. అంటే ఈ ప్రాంతాల్లో ముందుగానే సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు జనగణన నిర్వహించనున్నట్లు గత నెలలో =+× గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆగస్ట్ 17- 31 మధ్యే ఇక్కడ సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియ జరిగింది. ఈ ప్రాంతాల్లో శీతాకాలంలో పరిస్థితులు అనుకూలించని కారణంగా ముందుకు జరిపారు. ఈ ప్రాంతాల్లోని ప్రత్యేక భౌగోళిక వాతావరణ పరిస్థితుల నేపథ్యంలోనే ఇతర సాధారణ ప్రాంతాలతో కలిపి ఒకేసారి జనాభా లెక్కలు నిర్వహించడం కష్టం కావడంతో ప్రత్యేక షెడ్యూల్ రూపొందించారు.



కేంద్ర ప్రభుత్వం గతంలో 2025 జూన్ నెలలో విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం- పైన చెప్పిన మంచుతో కప్పబడి ఉండే ప్రాంతాలకు మినహాయించి దేశంలోని మిగతా అన్ని ప్రాంతాలకు 2027 మార్చి 1 ని రిఫరెన్స్ డేట్‌గా నిర్ణయించింది. ఇక గోవా, మణిపూర్, పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల శాసనసభల గడువు 2027 మే నాటికి ముగుస్తుంది. అంటే ఆలోపే ఎన్నికలు నిర్వహించాల్సి వస్తుంది. తీరా ఎన్నికల వేళ జనగణన నిర్వహిస్తే పెద్ద సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ ఉపాధ్యాయుల్ని మోహరించడం కష్టమని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఈ రాష్ట్రాల్లో సెన్సస్ ప్రక్రియను ముందుకు జరిపారు. ఇవి కాకుండా దేశంలోని మిగతా రాష్ట్రాల్లో జనాభా గణన ప్రక్రియ వచ్చే ఏడాది ఫిబ్రవరిలోనే ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ జనగణన ప్రక్రియలో కుటుంబంలోని వ్యక్తులకు సంబంధించిన వివరాలు సహా పలు సామాజిక, ఆర్థిక వివరాల్ని అధికారులు సేకరిస్తారు.

**కొవిడ్ వ్యాప్తి కారణంగా వాయిదా**

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎనిమిదో సారి జనగణన నిర్వహిస్తుండగా, ఈ ప్రక్రియ రెండు దశల్లో జరుగుతుంది. ఫస్ట్ ఫేజ్‌లో ఇళ్ల జాబితా, గణన ఉంటుంది. రెండో దశలో జనాభా లెక్కల్ని సేకరిస్తారు. ప్రస్తుత 2027 జనగణన ప్రక్రియ 2021లోనే జరగాల్సి ఉన్నప్పటికీ కొవిడ్-19 వ్యాప్తి కారణంగా ఇది వాయిదాపడింది. ఈ సెన్సస్ ప్రక్రియ నిర్వహణ కోసం కేంద్రం భారీగా ఖర్చు చేస్తోంది. ఏకంగా రూ. 11,718 కోట్ల విడుదలకు కేంద్ర కేబినెట్ ఆమోదించింది.

# మీడియా రంగం విశ్వసనీయత కోల్పోతోంది

ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర ఎంతో కీలకమని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. అయితే ప్రస్తుతం విశ్వసనీయత సంక్షోభం మీడియా రంగం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యగా మారిందని వ్యాఖ్యానించారు. అన్ని రంగాల్లోనూ క్రెడిబిలిటీ తగ్గుతున్నప్పటికీ, మీడియా రంగంలోనే ఈ సమస్య మరింత తీవ్రంగా కనిపిస్తోందని స్పష్టం చేశారు. నాగ్‌పూర్‌లో జరిగిన ఐఐఎం నాగ్‌పూర్ మీడియా కాన్‌క్లేవ్ 2026లో 'మీడియా, లీడర్‌షిప్ అండ్ ది న్యూ వరల్డ్ ఆర్డర్' అనే థీమ్‌తో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన గడ్కరీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఎడిటర్ ఇన్ చీఫ్ విజయ్ జోషి, బిజినెస్ స్టాండర్డ్ ఎడిటోరియల్ డైరెక్టర్ ఏకే భట్టాచార్య, బ్లిట్జ్ ఇండియా మీడియా గ్రూప్ ఛైర్మన్, ఎడిటర్ ఇన్ చీఫ్ దీపక్ ద్వివేది తదితరులు హాజరయ్యారు. భారత్ ప్రజాస్వామ్యానికి తల్లి లాంటిదని, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని గడ్కరీ అన్నారు. ప్రజాస్వామ్యంలో మంచి మార్పు రావాలంటే దాని కీలక వ్యవస్థలు సమర్థంగా పనిచేయాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్యంలోని నాలుగు స్తంభాలైన శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయవ్యవస్థ, మీడియా తమ బాధ్యతల్ని చక్కగా నిర్వర్తించాలి. ప్రజాస్వామ్యం పురోగతికి, అభివృద్ధికి స్వతంత్ర, నిష్పక్షపాత న్యాయవ్యవస్థతో పాటు స్వతంత్ర మీడియా కూడా అవసరమని అప్పుడే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని గడ్కరీ పేర్కొన్నారు.

**రాజకీయాల్లో భిన్నాభిప్రాయాలు సహజమే**



ప్రజాస్వామ్యానికి రాజకీయాలు, రాజకీయ పార్టీలు అతిపెద్ద బలమని కేంద్ర మంత్రి తెలిపారు. అయితే రాజకీయాల్లో అభిప్రాయ భేదాలు, సిద్ధాంతపరమైన విభేదాలు ఉండటం సహజమేనని గడ్కరీ చెప్పారు. 'ఒక వ్యక్తి లేదా పార్టీ తాను నమ్మిన సిద్ధాంతం పట్ల నిబద్ధతతో ఉండాలి. ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి సామాజిక, ఆర్థిక, విద్య సహా పలు అంశాలపై ప్రజల్లో అవగాహన పెంచడం కూడా అవసరమే. ప్రజలకు ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన ఉండటంతో పాటు వాటి పట్ల నిబద్ధత కలిగి ఉండటం కూడా చాలా ముఖ్యం' అని గడ్కరీ స్పష్టం చేశారు.

**మీడియా క్రెడిబిలిటీనే బాగా పడిపోయింది**

21వ శతాబ్దంలో ఏ రంగానికైనా విశ్వసనీయత, మంచి పేరు (గుడ్‌విల్), నిజాయతీనే అతిపెద్ద పెట్టుబడులు అని గడ్కరీ పేర్కొన్నారు. అన్ని రంగాల్లో క్రెడిబిలిటీ కొంత తగ్గిందని, కానీ మీడియాలో మాత్రం విశ్వసనీయత చాలా ఎక్కువగా పడిపోయిందని ఆయన వ్యాఖ్యానించారు. అయితే ఇక్కడ అన్ని మీడియా సంస్థలు తమ విశ్వసనీయత కోల్పోయాయని తాను చెప్పట్లేదని స్పష్టం చేశారు. మీడియా తన విశ్వసనీయతను తిరిగి ఎలా సాధించాలనే దానిపై ఆలోచించాల్సిన అవసరం ఉందని గడ్కరీ సూచించారు. గతంలో కొన్ని పత్రికలు సహా మీడియా సంస్థలు ఎన్నికల్లో ఎవరు గెలుస్తారో తామే నిర్ణయించగలమన్న స్థాయిలో మాట్లాడేవని గడ్కరీ తన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. అయితే సోషల్ మీడియా రాకతో పరిస్థితి పూర్తిగా మారి పోయిందని అన్నారు. మీడియాతో పాటు రాజకీయాల్లో కూడా విశ్వసనీయత సంక్షోభం ఉందని పేర్కొన్న గడ్కరీ, అన్ని రంగా ల్లోనూ సమస్య ఉన్నప్పటికీ మీడియా రంగంలో క్రెడిబిలిటీ సంక్షోభమే అతిపెద్ద సమస్య అని అభిప్రాయపడ్డారు. అందుకే దీనిని తిరిగి తెచ్చుకునేందుకు జర్నలిస్టులు ప్రజలు, సమాజం, దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని వార్తలు రాయాలని గడ్కరీ సూచించారు. జర్నలిజంలో నాణ్యతతో పాటు వృత్తి విలువలను కాపాడుకోవాలని అన్నారు. రాబోయే రోజుల్లో తమ విశ్వసనీయతను కాపాడుకుంటూ, వృత్తి ప్రాథమిక విలువలను గౌరవించే మీడియా సంస్థలు, జర్నలిస్టులే నిలదొక్కుకుంటారని గడ్కరీ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం, సామాజిక న్యాయం, జాతీయ ప్రయోజనాలను కాపాడటం, ప్రజలకు వాస్తవ సమాచారం చేరవేయడం వంటి అంశాలపై మీడియా దృష్టి పెట్టాలని సూచించారు. ఇవన్నీ భారత్‌ను విశ్వగురుగా ఎదిగేందుకు దోహదపడతాయని గడ్కరీ ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాట్లాడిన ఐఐఎం నాగ్‌పూర్ డైరెక్టర్ డాక్టర్ భీమరాయ మెట్రి- దేశ అభివృద్ధిలో నేటి యువత కీలక పాత్ర పోషించనుందని అన్నారు.

## డ్రగ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

విద్యార్థుల్లో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం, అధిక స్క్రీన్ టైమ్‌పై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. పిల్లలను కేవలం చదువులోనే కాకుండా వారి ప్రవర్తన, రోజువారీ జీవితం, ఆసక్తులు, అలవాట్ల పరంగా కూడా గమనించాలని చెప్పారు. క్రీడలు, శారీరక ఆటలు, సృజనాత్మక కార్యక్రమాల ద్వారా పిల్లలను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని సూచించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జాతీయ అవార్డులకు ఎంపికైన ఉపాధ్యాయులతో ప్రధాని మోదీ శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పిల్లల భవిష్యత్తు, విద్యా విధానం, డ్రగ్స్, స్క్రీన్ టైమ్ వంటి అంశాలపై వారితో చర్చించారు. ఈ భేటీకి సంబంధించిన వీడియోను శనివారం విడుదల చేశారు. "ఉపాధ్యాయులు పుస్తకాలు, సిలబస్‌కే పరిమితం కాకుండా విద్యార్థుల జీవితాల్లో భాగం కావాలి. పిల్లల్లో సహజంగా ఉండే ఆసక్తి, తెలుసుకోవాలనే కుతూహలాన్ని గుర్తించి దాన్ని సరైన దిశలో మళ్లించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది. పిల్లల బాల్యాన్ని కోల్పోకుండా చూడటం ఉపాధ్యాయులు చేయగలిగే అతిపెద్ద సేవ. తరగతి గదిలో పాఠాలను మరింత ఆసక్తికరంగా మార్చేందుకు సృజనాత్మక పద్ధతులను అనుసరించాలి. విద్యార్థుల అకడమిక్ పనితీరును మాత్రమే ప్రామాణికంగా తీసుకోకూడదు. పిల్లల ప్రవర్తనలో ఏవైనా అసాధారణ మార్పులు కనిపిస్తున్నాయా? వారి రోజువారీ జీవితం ఎలా ఉంది? అనే విషయాలను ఉపాధ్యాయులు నిశితంగా గమనించాలి. గతంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో పిల్లలపై తల్లిదండ్రులతో పాటు ఇతర కుటుంబసభ్యుల పర్యవేక్షణ కూడా ఉండేది. ప్రస్తుతం ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోతున్న నేపథ్యంలో విద్యార్థుల జీవితాల్లో ఉపాధ్యాయుల పాత్ర మరింత పెరిగింది."

**డ్రగ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి**

కొన్ని పెద్ద నగరాలు, విశ్వవిద్యాలయాల్లో మాదకద్రవ్యాల సమస్యను గుర్తించడం కష్టంగా మారుతోందని మోదీ అన్నారు. ఎవరు ఎవరికి ఏం ఇస్తున్నారో తెలుసుకోవడం కూడా కష్టమైన పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధ్యాయులే డ్రగ్స్ దుష్ప్రభావాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ముందుకు రావాలని సూచించారు. అదే సమయంలో ఏ విద్యార్థి ప్రవర్తనలోనైనా ఆకస్మిక మార్పులు కనిపిస్తే వాటిని నిర్లక్ష్యం చేయకుండా నిశితంగా పరిశీలించాలని చెప్పారు.

**'మొబైల్ వినియోగానికి క్రీడలే పరిష్కారం'**

విద్యార్థుల్లో అధిక స్క్రీన్ టైమ్ మరో ప్రధాన సమస్యగా మారిందని ప్రధాని పేర్కొన్నారు. పిల్లలు రోజులో ఎంతసేపు మొబైల్, ఇతర స్క్రీన్లను చూస్తున్నారు? రాత్రివేళల్లోనూ ఫోన్లు ఉపయోగిస్తున్నారా? అనే విషయాలను తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు చర్చించాలని సూచించారు. స్క్రీన్ టైమ్‌ను తగ్గించేందుకు కేవలం ఆంక్షలు విధించడం కంటే పిల్లల్లో క్రీడలు, శారీరక ఆటలు, సృజనాత్మక కార్యకలాపాలపై ఆసక్తి పెంచడం ద్వారా సహజంగానే మొబైల్ వినియోగాన్ని తగ్గించవచ్చని మోదీ అన్నారు. జాతీయ విద్యా విధానం (ఎన్?ఈపీ)ను ప్రస్తావించిన ప్రధాని పిల్లలను తరగతి గదికే పరిమితం చేయకూడదని అన్నారు. నిజ జీవిత నైపుణ్యాలు, వివిధ రకాల పనులు, సమాజంతో వారికి పరిచయం కల్పించాలని సూచించారు. విద్య కేవలం పుస్తకాల్లోని విషయాలకు పరిమితం కాకుండా జీవితాన్ని అర్థం చేసుకునేలా ఉండాలని పేర్కొన్నారు.

**మహిళల్లో క్యాన్సర్ అవగాహనపై ప్రశంస**

తన పరిసర ప్రాంతాల్లో మహిళలకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న ఓ ఉపాధ్యాయురాలి ప్రయత్నాన్ని ప్రధాని ప్రత్యేకంగా ప్రశంసించారు. తన లోక్‌సభ నియోజకవర్గమైన వారణాసిలో తాను రొమ్ము క్యాన్సర్ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. ఎక్కువ మంది మహిళలు స్క్రీనింగ్ కోసం ముందుకు వస్తున్నారని, ఈ కార్యక్రమంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు కూడా నమోదైనట్లు మోదీ తెలిపారు.

**82 మంది ఉపాధ్యాయులకు జాతీయ పురస్కారాలు**

ఈ ఏడాది జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలకు మొత్తం 82 మంది ఉపాధ్యాయులు, విద్యావేత్తలు ఎంపికయ్యారు. ఇందులో పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం నుంచి 48 మంది, ఉన్నత విద్యా సంస్థలు, పాలిటెక్నిక్?ల నుంచి 21 మంది, నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖకు చెందిన 13 మంది స్కిల్ ట్రైనర్లు ఉన్నారు.

## సెప్టెంబర్ 9వ తేదీ లోపు ఇరాన్‌పై దాడి

**న్యూఢిల్లీ :** ఇరాన్‌పై పునఃప్రారంభించిన సైనిక చర్య ఎక్కువ కాలం కొనసాగదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంటున్నారు. అయితే, అవసరమైతే అమెరికా మళ్లీ దాడి చేయవచ్చని ఆయన హెచ్చరిక కూడా జారీ చేశారు. ఈ రెండు అంశాలు ఒక అతిపెద్ద ప్రశ్నను లేవనెత్తుతున్నాయి:ఇరాన్ జాతకం, వార్షిక అంచనాలు, రాబోయే ఆరు రోజుల పంచాంగాన్ని పరిశీలిస్తే, ప్రమాదం ఇంకా తొలగిపోలేదు. సెప్టెంబర్ 6, 8 తేదీలు ముఖ్యంగా ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. అయితే, దీనిని దాడి కచ్చితంగా జరుగుతుందని చెప్పే అంచనాగా పరిగణించలేము. ఈ తేదీలలో జరిగే ఏ సైనిక చర్య అయినా, ప్రతీకార దాడి అయినా, నౌకకు సంబంధించిన సంఘటన అయినా, లేదా సాంకేతిక వైఫల్యం అయినా ఉద్రిక్తతలను పెంచవచ్చు.ఇరాన్‌పై అమెరికా చేపట్టిన కొత్త సైనిక చర్య ఎక్కువ కాలం కొనసాగదని సెప్టెంబర్ 2న ట్రంప్ అన్నారు. హోర్ముజ్ సమీపంలో అమెరికా సైన్యం ఇరాన్ రాడార్, క్షిపణి వ్యవస్థలు, సముద్ర మైన్లు అమర్చే పరికరాలను ధ్వంసం చేసిందని ఆయన పేర్కొన్నారు.అమెరికా ఎప్పుడైనా మరో దాడిని ప్రారంభించవచ్చని ట్రంప్ కూడా పేర్కొన్నారు. దీని అర్థం, సైనిక చర్యను నిలిపివేస్తున్నట్లు అధికారిక ప్రకటన ఏదీ వెలువడలేదు. మరో దాడి జరుగుతుందా లేదా అనేది ఇరాన్ ప్రతిస్పందన ,హోర్ముజ్‌లోని పరిస్థితిపై ఆధారపడి ఉంటుందిఅమెరికా జరిపిన తాజా దాడులతో ఇరాన్ జోర్డాన్, బహ్రెయిన్, కువైట్, ఇరాక్‌లలోని అమెరికా స్థావరాలు, ప్రయోజనాల వైపు క్షిపణులు, డ్రోన్‌లను ప్రయోగించింది. ఈ దాడులలో పలువురిని గగనతలంలోనే అడ్డుకున్నట్లు ఆ దేశం ప్రకటించింది. అమెరికా దాడుల్లో 18 మంది మరణించారని, 108 మంది గాయపడ్డారని ఇరాన్ పేర్కొంది. హోర్ముజ్ సమీపంలో జరిగిన వివాహ వేడుకపై కూడా దాడి జరిగిందని ఇరాన్ మీడియా నివేదించింది. పౌర మృతిపై వచ్చిన నివేదికలపై దర్యాప్తు చేస్తున్నట్లు అమెరికా తెలిపింది. ఈ సంఘటన పరిస్థితిని మరింత తీవ్రతరం చేసింది. ఇరాన్ తన ప్రతీకార చర్యలను తీవ్రతరం చేస్తే, అమెరికా దీనిని ఒక కొత్త దాడికి ఆధారంగా ఉపయోగించుకోవచ్చు. మరోవైపు, ఇరాన్ మౌనం దాని సొంత దేశంలోనే బలహీనతగా భావించబడవచ్చు.సెప్టెంబర్ 6వ తేదీ ఆకస్మిక సైనిక లేదా సాంకేతిక సంఘటనకు అత్యంత అవకాశం ఉన్న రోజు. సెప్టెంబర్ 8వ తేదీ ప్రత్యర్థి పక్షం ద్వారా మరో ప్రధాన చర్య లేదా ఎదురుదాడికి వేదిక కావచ్చు.సైనిక చర్య ఎక్కువ కాలం కొనసాగదని ట్రంప్ చెబుతున్నప్పటికీ, సెప్టెంబర్ 9వ తేదీకి ముందే యుద్ధం మరో మలుపు తిరగవచ్చు. ఆ తర్వాత కాల్పులు పూర్తిగా ఆగిపోయే అవకాశం లేదు. కానీ, చర్చల కోసం యుద్ధం తిరిగి ప్రారంభమయ్యే అవకాశం మాత్రం ఖచ్చితంగా పెరుగుతుంది

## ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లుపై జేపీసీ.

**న్యూఢిల్లీ :** విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ బిల్లు, 2026 పై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా జాయింట్ పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేశారు. బిహార్ బీజేపీ ఎంపీ, లోక్‌సభలో బీజేపీ చీఫ్ విప్ డాక్టర్ సంజయ్ జైస్వాల్ ఈ కమిటీకి ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్నారు. లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలతో కూడిన జాయింట్ కమిటీ, ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లు, పలు అంశాలను పరిశీలించనుంది. ఈఅఖీం జాయింట్ పార్లమెంటరీ కమిటీలో పలు రాజకీయ పార్టీలకు చెందిన ఎంపీలు ఉన్నారు. బీజేపీ నుంచి డాక్టర్ సంజయ్ జైస్వాల్, భర్తృహరి మహతాబ్, తేజస్వి సూర్య, కమలేష్ జంగ్దే, ముఖేష్ కుమార్ చంద్రకాంత్ దలాల్, డాక్టర్ నిషికాంత్ దూబే, విష్ణు దయాళ్ రామ్, అనంత్ నాయక్, అరవింద్ ధర్మపురి సభ్యులుగా ఉన్నారు. కాంగ్రెస్ తరపున ఆంటో ఆంటోనీ, కెప్టెన్ విరియాటో ఫెర్నాండెజ్, మహ్మద్ హముల్లా సయీద్, కాళీ చరణ్ ముండా ఉన్నారు.ఈ ప్యానెల్‌లోని ఇతర లోక్‌సభ ఎంపీలలో సమాజ్‌వాదీ పార్టీకి చెందిన జియా-ఉర్-రెహమాన్, టీఎంసీకి చెందిన కళ్యాణ్ బెనర్జీ, డీఎంకేకు చెందిన ఎ. రాజా, టీడీపీకి చెందిన లావు శ్రీ కృష్ణ దేవరాయలు, శివసేనకు చెందిన నరేష్ గణపత్ మస్కే, జేడీ(యూ)కి చెందిన కౌశలేంద్ర కుమార్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ-శరద్చంద్ర పవార్, ఎన్‌సీపీ-ఎస్పీకి చెందిన సుప్రియా సూలే, ఐయూఎంఎల్‌కు చెందిన ఈటీ మహమ్మద్ బషీర్ ఉన్నారు.జాయింట్ కమిటీలో రాజ్యసభ ఎంపీలు సి.సదానందన్ మాస్టర్, హర్షవర్ధన్ ష్రింగ్లా, ఉజ్వల్ దేవ్‌రావ్ నికమ్, డాక్టర్ అల్కా గుర్జార్, సత్ పాల్ శర్మ, ప్రఫుల్ పటేల్, సంజయ్ కుమార్ ఝా, క్రిస్టోఫర్ మాణికం, డాక్టర్ మేనకా గురుస్వామి, పి.విల్సన్ ఉన్నారు.

# ప్రత్యేక పూజలో పాల్గొన్న జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి

**ధర్మవరం,సెప్టెంబర్ 05 (పెన్ సత్తా)**పట్టణంలోని 28వ వార్డులో ముస్లిం మైనార్టీల ఆహ్వానం మేరకు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మసీదులోని చిన్న చిన్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వార్డులో పర్యటిస్తూ ప్రజలను కలుసుకుని వారి సమస్యలను ఒక్కొక్కటిగా అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని స్థానికులు చిలకం మధుసూదన్ రెడ్డి దృష్టికి తీసుకురాగా అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా మసీదు స్థలంలో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభం సమస్యను గుర్తించి, ఏ ఈ నాగభూషణ్ తో మాట్లాడి విద్యుత్ స్తంభాన్ని కొంత పక్కకు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. అలాగే వార్డులోని చేనేత కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకుని,వారి ఇబ్బందులను త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## స్పెషల్ డ్రైవ్ లో ఎక్సైజ్ అధికారుల దాడులు...

- పలువురు అరెస్ట్...
- ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కె.వి పాపునాయుడు...

**చోడవరం (పెన్ సత్తా):**డైరెక్టర్,ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్, ఆంధ్రప్రదేశ్ వారి ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ లో భాగంగా తేదీ 01.09.2026 నుండి ఇప్పటివరకు సుమారు 6 కేసులలో అనధికార మద్యం షాపులు నిర్వహిస్తున్న 6గురు ముద్దాయిలను అరెస్ట్ చేసి వారు వద్ద నుండి 11.18 లీటర్ల మద్యం ను స్వాధీనం పరుచుకోవడం అయినది మరియు నాటు సారాయి అమ్మకాలు జరుపుతున్న ఒకరిపై కేసు నమోదు చేసి వారి వద్ద నుండి 2 లీటర్ల నాటు సారాయి స్వాధీనం చేసుకోవడం జరిగినది. అలాగే మా స్టేషన్ పరిధిలో నాలుగు మండలాలు చోడవరం, బుచ్చయ్యపేట, కే.కోటపాడు మరియు దేవరాపల్లి లో గత రెండు సంవత్సరాలు సమయంలో సుమారు 134 కేసులలో 100 మంది పై నాటు సారాయి కేసులు పెట్టడం జరిగినది అలాగే వారు వద్ద నుండి 571.52 లీటర్ల నాటు సారాయి స్వాధీనం చేసుకుని సీజ్ చేయడం జరిగినది మరియు నాటు సారాయి తయారికి ఉపయోగించే సుమారు 5 వేల 653 కేజీల నల్ల బెల్లం మరియు 41 వేల 180 లీటర్ల పులిసిన బెల్లం ఊటలను ధ్వంసం చేయడం జరిగినది. అలాగే గ్రామాలలో అనాధికార మద్యం అమ్మకాలు(బెల్ట్ షాప్ లు నిర్వహించిన) జరిపిన వారిపై 210 కేసులలో సుమారు 211 మందిపై కేసులు పెట్టి సుమారు 512.61 లీటర్ల మద్యం ను స్వాధిని పరచుకోవడం జరిగినది అందులోనే రెండు ద్విచక్ర వాహనాలను కూడా సీజ్ చేయడం జరిగినది.. గత రెండు సంవత్సరాల్లో జరిగిన లోక్ అదాలత్ లలో అనాధికార మద్యం అమ్మకందారులు నుంచి సుమారు 257 కేసులలో 14 లక్షల 9 వేల 691/- రూపాయలు గవర్నమెంట్ కు చలానా రూపంలో జరిమానా కట్టించడం జరిగినది. అదేవిధంగా సత్ప్రవర్తనకోసం బిండోవర్ చేసిన 06 ముద్దాయిలు సదరు బిండోవర్ ఉల్లంఘించిన నేరంగాను వారినుంచి 70 వేలు రూపాయలు ఫైన్ ద్వారా వసూలు చేయడం జరిగింది.నాటు సారా తయారు చేసినా అమ్మకాలు జరిపినా కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు..

# బోధనలో ప్రతిభకు పట్టం





- గురువుల ప్రతిభకు జిల్లా స్థాయి గుర్తింపు
- ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల్లో అచ్యుతాపురం సత్తా
- జిల్లా స్థాయిలో నలుగురికి అరుదైన గుర్తింపు

**అచ్యుతాపురం, (పెన్ సత్తా)** జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల్లో అచ్యుతాపురం మండలం సత్తా చాటింది. మండలానికి చెందిన నలుగురు ఉపాధ్యాయులు జిల్లా స్థాయి ఉత్తమ అవార్డులు ఎంపికై అరుదైన గుర్తింపు సాధించారు. పూడిమడక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అరుణకుమారి, పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కృష్ణమోహన్, కొండకర్ల పాఠశాల శ్రీనివాసరావు, హరిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆర్. శశికళ అవార్డులకు ఎంపికయ్యారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపు, నాణ్యమైన బోధన, పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల పట్ల అంకితభావంతో చేసిన సేవలను పరిగణనలోకి తీసుకుని వీరిని జిల్లా స్థాయి పురస్కారాలకు ఎంపిక చేసినట్లు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. ఒకే మండలం నుంచి నలుగురు ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి గుర్తింపు లభించడం పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ పురస్కారాలకు ఎంపికైన ఈ. అరుణకుమారి, కే. కృష్ణమోహన్, కే. శ్రీనివాసరావు, ఆర్. శశికళలను మండల విద్యాశాఖ అధికారి దేవరాయల్ అభినందించారు. వీరి ఎంపిక అచ్యుతాపురం మండల విద్యారంగానికి గర్వకారణమని పేర్కొన్నారు.





## స్వేచ్ఛా స్కూల్ లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు.....





**చోడవరం (పెన్ సత్తా) :**స్వేచ్ఛా స్కూల్ లో ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదిన వేడుకలు జరిగాయి, ఉదయం నుంచి సంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి పిల్లలు ఉపాధ్యాయల వేసధారణలో ఆకట్టుకున్నారు,విద్యార్థులను ఉద్దేశించి ఉపాధ్యాయులు ఉపన్యాసించి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి ఆనందం వ్యక్తపరుచారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ జి. ప్రసాద్ రావు , వైస్ ప్రిన్సిపాల్ కిషోర్ కుమార్, ఏ ఓ దాడి రమేష్ మరియు ఉపాధ్యాయ బృందం పాల్గున్నారు.



## అంగన్వాడీ కేంద్రాల్లో ఘనంగా గురుపూజోత్సవం





**అచ్యుతాపురం, (పెన్ సత్తా)** అంగన్వాడీ కేంద్రాల్లో శనివారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రముఖ విద్యావేత్త, మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు సుహాసిని పలు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తూ, వారి భవిష్యత్తుకు బాటలు వేసే గురువుల సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. చిన్నారులలో క్రమశిక్షణ, మంచి అలవాట్లు, విద్యపై ఆసక్తిని పెంపొందించడంలో అంగన్వాడీ కార్యకర్తల పాత్ర కీలకమని తెలిపారు. అనంతరం చిన్నారులతో ఉపాధ్యాయ దినోత్సవం ప్రాధాన్యాన్ని వివరించి, గురువులను గౌరవించే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు, చిన్నారులు పాల్గొన్నారు.

## మా ప్రభుత్వంలో ఇచ్చిన వాగ్దానాలు సకాలంలో జరిగేవి...

- కూటమి ప్రభుత్వంలో వాగ్దానాల పరిస్థితి ఏంటి?..
- బొత్స సత్యనారాయణ కామెంట్స్..







**చోడవరం (పెన్ సత్తా)** గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోగానీ, వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలోగానీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను, చెల్లింపులను సకాలంలో జరిగేవి..

రాష్ట్రంలో లక్షల కోట్ల అప్పులు, బడ్జెట్ లావాదేవీల గురించి మాట్లాడేవారు టీడీపీ నాయకులు చిన్న మొత్తం అయిన 30 కోట్ల రూపాయలు గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతులకు ఎందుకు చెల్లించట్లేదు..

దాదాపు 24 వెల మంది రైతు కుటుంబాలకు, కార్మికులకు సంబంధించి ఇవ్వాల్సిన సుమారు 35 కోట్ల మొత్తాన్ని కూడా చెల్లించడానికి ఇంత సమయం పడుతుందా..

ఈ ప్రాంతానికి ముఖ్యమంత్రి రెండు, మూడు సార్లు వచ్చినప్పుడు ఆయన పర్యటనలకు భారీగా ప్రజాధనం ఖర్చు అయ్యింది, కానీ బాధితులకు ఇవ్వాల్సిన సహాయాన్ని మాత్రం సకాలంలో ఇవ్వడం మాత్రం చెయ్యరు.

స్థానిక టీడీపీ నాయకులు, ఎంపీ, ఇతర మంత్రులు బాధితుల సమస్యలను పరిష్కరించడం మానేసి..పసలేని మాటలు, ఆరోపణలతో కాలక్షేపం చేస్తున్నారు..వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఎలాంటి విపత్తులు వచ్చినా వెంటనే స్పందించి ఒకట్రెండు రోజుల్లోనే పరిష్కారం చేసేవాళ్ళం.

చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే రాష్ట్రంలో కరువు వస్తుందనేది రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు..

?వ్యవసాయం, రైతుల సమస్యలను ఈ ప్రభుత్వం అస్సలు పట్టించుకోదు..

రైతులకు అవసరమైన యూరియా, ఎరువుల పంపిణీకి ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టడం ఏంటి కేంద్ర ప్రభుత్వంలోనూ, రాష్ట్ర ప్రభుత్వంలోనూ భాగస్వామ్యంగా ఉన్న కూటమి ప్రభుత్వం, ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా లేని ఈ ఆన్‌లైన్ నిబంధనలను ఇక్కడే ఎందుకు అమలు చేస్తోంది..

ఒక రైతు అరబస్తా లేదా బస్తా ఎరువు కోసం ఆన్‌లైన్ క్యూలలో చెప్పులు లైన్లో పెట్టి వేచి చూడాల్సిన దౌర్భాగ్య పరిస్థితిని తీసుకొచ్చారు..

# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు.

**ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ మరియు స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ.**





**అనకాపల్లి (పెన్ సత్తా)** చీకటిని తొలగించి, జ్ఞానమనే వెలుగులను పంచే దివ్యదీపం ఉపాధ్యాయుడని జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ పేర్కొన్నారు. శనివారం ఉదయం ఎస్. ఆర్.శంకరం సమావేశం మందిరంలో అత్యంత వైభవంగా జిల్లాస్థాయి గురుపూజోత్సవ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ మరియు శాశనసభ్యులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జ్యోతి ప్రజ్వలన అనేది కేవలం ఒక సంప్రదాయం మాత్రమే కాకుండా, విద్యార్థుల జీవితాల్లో జ్ఞానదీపాలను వెలిగించే బాధ్యతకు ప్రతీక అని తెలిపారు.విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనదని, వారి నిరంతర కృషి వల్లే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, అడ్మిషన్లు గణనీయంగా పెరిగాయని జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ చెప్పారు. గత రెండేళ్లలో చేపట్టిన ప్రత్యేక ప్రచార కార్యక్రమాల వల్ల జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం 2,04,000 (2.04 లక్షల) మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు.

విద్యార్థుల చదువును

ప్రోత్సహించేందుకు 'తల్లికి వందనం' పథకం కింద జిల్లా పరిధిలో రూ. 301 కోట్లు తల్లుల ఖాతాల్లో జమ చేయడం జరిగింది. పాఠశాలల మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 10 కోట్లు, ఎస్ఎంసి (ఎస్ ఎం సి) గ్రాంట్ల కింద రూ. 5.19 కోట్లు విడుదల చేసి వసతులు మెరుగుపరిచామని చెప్పారు. పదో తరగతి ఫలితాలు 100 రోజుల ప్రత్యేక ప్రణాళిక ద్వారా 90% పైగా ఉత్తీర్ణత సాధించడమే కాకుండా, వెనుకబడిన వేలాది మంది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తీర్ణులను చేసిన ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. వ్యాయామ (పిటి) పీరియడ్లలో మ్యాథ్స్, సైన్స్ వంటి సబ్జెక్టులు చెప్పకూడదని, ఆ సమయంలో పిల్లలను మైదానంలో ఆడుకోనివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆటల ద్వారా గెలుపోటములను సమానంగా స్వీకరించే మానసిక స్థైర్యం, శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతాయని స్పష్టం చేశారు. పిల్లలు రోజులో 8 నుండి 9 గంటల సమయం ఉపాధ్యాయులతోనే గడుపుతారని, ఉపాధ్యాయులు చెప్పే ప్రతి మాటను నిజమని నమ్ముతారని పేర్కొన్నారు. కాబట్టి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని, మంచి నైతిక విలువలను పెంపొందించేలా ప్రోత్సహించాలని సూచించారు.

సమాజంలో మంచి పౌరులుగా పిల్లలను తీర్చిదిద్దే బాధ్యతను ఉపాధ్యాయులు శక్తివంచన లేకుండా నిర్వర్తించాలని కోరుతూ, జిల్లాలోని ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ, పదవ తరగతి విద్యార్థుల కోసం అమలు చేసిన 100 రోజుల ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ద్వారా 90% ఉత్తీర్ణత సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మొదట్లో వెనుకబడిన సుమారు 2,000 మంది విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించగా, ఉపాధ్యాయుల కృషి వల్ల వారిలో 1,000 మందికి పైగా విద్యార్థులు తిరిగి ఉత్తీర్ణులయ్యారని మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులు చేపట్టిన ప్రత్యేక ప్రచార కార్యక్రమాల ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగి, ప్రస్తుతం జిల్లాలో 2.04 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. తల్లికి వందనం విద్యను ప్రోత్సహించే లక్ష్యంతో జిల్లాలోని తల్లులకు 'తల్లికి వందనం' పథకం కింద రూ. 301 కోట్ల ఆర్థిక సాయం అందించడం జరిగింది. షైనింగ్ స్టార్ అవార్డులు ప్రతిభ కనబరిచిన 158 మంది విద్యార్థులకు రూ. 3 కోట్ల విలువైన 'షైనింగ్ స్టార్' అవార్డులను పంపిణీ చేశారు.గొల్లపాలెం (గొల్జాం) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతిక విజ్ఞాన (ఫిజికల్ సైన్స్) ఉపాధ్యాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు అంతర్జాతీయ స్థాయి బోధనా పద్ధతులు, విద్యా విధానాలపై అవగాహన కల్పించేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో చేపట్టిన "ఫిన్లాండ్ ఎడ్యుకేషన్ ఎక్స్పోజర్ ట్రిప్" అత్యంత ప్రాధాన్యత సంతరించుకుందని తెలిపారు. 'లీప్' పరీక్ష ద్వారా ఎంపికై ఈ పర్యటనలో పాల్గొన్న ఆయన, తమ అధ్యయన వివరాలను మీడియాకు వెల్లడించారు. ఫిన్లాండ్ పర్యటనకు ముందు విజయవాడలో 5 రోజుల పాటు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఉపాధ్యాయులందరూ 6 బృందాలుగా విడిపోయి ఫిన్లాండ్ విద్యా వ్యవస్థపై ప్రాథమిక అసైన్మెంట్లు, అధ్యయనం పూర్తి చేశారు. ఫిన్లాండ్ పర్యటనలో భాగంగా 8 రోజుల పాటు వివిధ పాఠశాలలను సందర్శించగా, అక్కడి 'ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్' (8 నెలల నుండి 6 సంవత్సరాల వయస్సు విధానం ఎంతగానో ఆకట్టుకుందని, చిన్నతనంలోనే పిల్లలకు ఏం చేయాలి, ఏం చేయకూడదు అనే విషయాలతో పాటు ప్రవర్తన, వ్యక్తిత్వ వికాసం పైనే అక్కడ ప్రధానంగా దృష్టి సారిస్తున్నారు. మన రాష్ట్రంలో కూడా అంగన్వాడీ కేంద్రాల స్థాయి నుంచే విద్యా పునాదులను మరింత బలోపేతం చేస్తే, ప్రాథమిక విద్యలో విప్లవాత్మక మార్పులు సాధించవచ్చని స్పష్టం చేశారు.ఫిన్లాండ్ విద్యా వ్యవస్థపై ప్రాథమిక అసైన్మెంట్లు, అధ్యయనం పూర్తి పూర్తి చేసిన ఉపాధ్యాయులు

గోపీనాథ్ (ఎస్జిటి, ఎంపీపీ ఎస్ శివరాంపురం), పి.వి.ఎం. నాగజ్యోతి (స్కూల్ అసిస్టెంట్, జడ్పీహెచ్ఎస్ రోలుగుంట), ఎల్.వి. నారాయణరావు (స్కూల్ అసిస్టెంట్, జడ్పీహెచ్ఎస్ గొల్లుపాలెం ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డును అందజేశారు. పాఠశాల విద్యార్థుల అభ్యున్నతికి, విద్యా రంగానికి విశేష సేవలు అందించిన హెడ్ మాస్టర్లు , పాఠశాల సహాయకులు మరియు ఎస్జీటీ ఉపాధ్యాయులను వేదికపై శాలువాలు, ప్రశంసా పత్రాలు మరియు మెమొంటోలతో ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి, వివిధ ప్రజాప్రతినిధులు మరియు విద్యాశాఖ అధికారులు హాజరయ్యారు





# కైట్స్ విద్యా విహార్‌లో గురుపూజోత్సవం










**గురువుల బోధనలే విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు**

**అచ్యుతాపురం, (పెన్ సత్తా)** కైట్స్ విద్యా విహార్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. ప్రముఖ విద్యావేత్త, మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థుల కేరింతలు, అభినందనల మధ్య పాఠశాల వ్యవస్థాపకులు రెడ్డి అప్పలనాయుడు, ప్రిన్సిపల్ లక్ష్మీ ప్రసన్న, డైరెక్టర్లు ప్రియాంక, రెడ్డి చిరంజీవితో పాటు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా కరస్పాండెంట్ రెడ్డి గణేష్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలకు సరైన దిశానిర్దేశం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. పాఠ్యాంశాల బోధనతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. గురువులు అందించే జ్ఞానం, మార్గదర్శనం విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. సమాజానికి బాధ్యతాయుతమైన, ఉత్తమ పౌరులను అందించడంలో ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని అన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల సందడి, ఉపాధ్యాయుల సన్మానంతో పాఠశాలలో పండగ వాతావరణం నెలకొంది. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## ఘనంగా జన సైనికుడు అర్జిల్లి అప్పలరాజు జన్మదిన వేడుకలు.



**పరవాడ (పెన్ సత్తా)** జనసేన పార్టీ నాయకులు అర్జిల్లి అప్పలరాజు జన్మదిన వేడుకలు శనివారం పరవాడ మండల పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ పరవాడ మండల ఇన్‌చార్జి, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల సోదరులు పంచకర్ల ప్రసాదరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పార్టీ నాయకులు,ఎన్డీఏ కూటమి శ్రేణుల సమక్షంలో అర్జిల్లి అప్పలరాజు కేక్ కట్ చేశారు. అనంతరం నాయకులు ఆయనకు కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అర్జిల్లి అప్పలరాజు ఆయురారోగ్యాలతో నిండూ నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.జనసేన అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశయా సిద్ధాంతాలను ప్రజల్లోకి ముందుకు తీసుకువెళ్తు నిస్వార్థ జన సైనికుడుగా నిజాయితీ కలిగిన కార్యకర్తగా అంకిత భావంతో పనిచేస్తూ జనసేన పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న అర్జిల్లి అప్పలరాజుకు నాయకులు, కార్యకర్తలు ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.జన్మదిన మహోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయంలో సందడి వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా కార్యదర్శి బుగిడి గోవిందరావు, నగిరెడ్డి చిన్నారావు,జనసేన పరవాడ మండల పార్టీ ఉపాధ్యక్షుడు వెన్నెల నరసింహరావు, డీవీఎంసీ సభ్యులు ఎం.డి. రాజు, శివలంక నర్సింగరావు, సోమరాజు, అనిల్‌కుమార్, పవన్, సమ్మంగి అప్పారావు, చింతకాయల ముత్యాలు, సమ్మంగి మున్నా తదితర ఎన్డీఏ కూటమి నాయకులు, జనసేన శ్రేణులు పాల్గొన్నారు.ఆత్మీయతకు కృతజ్ఞతలు తన జన్మదిన వేడుకలకు హాజరై శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ అర్జిల్లి అప్పలరాజు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. నాయకులు,కార్యకర్తలు,అభిమానులు చూపిన ఆప్యాయతకు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు.

## పెదబోదుగల్లం హైస్కూలులో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



**నక్కపల్లి (పెన్ సత్తా)**నక్కపల్లి మండలంలో పెదబోదుగల్లం హైస్కూలులో శనివారం విద్యార్థులు,తల్లిదండ్రుల సమక్షంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.ముందుగా భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి హెచ్ ఎమ్. ఎస్.జయశ్రీ, ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు,విద్యార్థుల సమక్షంలో జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.దీనిలో భాగంగా సమావేశానికి అధ్యక్షత వహించిన హెచ్.ఎమ్ జయశ్రీ ,మరియు పాఠశాల ఉపాధ్యాయులు గురుపూజోత్సవ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు.ప్రతీ విజయంవెనుక కనిపించని ఒక గురువు త్యాగం ఉంటుందని,ప్రతీ గొప్ప ప్రయాణంవెనుక మార్గంచూపిన ఒక గురువు అడుగుజాడ ఉంటుందని,అన్నారు.ఒక మట్టి ముద్దను జాతి మెచ్చే ఒక శిల్పంగా మార్చేందుకు తన సమయాన్ని,శక్తిని ధారపోసే గురువు కృషి ఉంటుందని ఆమె పేర్కొన్నారు.మనకు ఆస్తి పాస్తులు శాశ్వతం కాదని గురువు అందించే అక్షరజ్ఞానమే అసలైన ఆయుధంగా పనిచేస్తుందని వారు పేర్కొన్నారు.

అనంతరం పాఠశాలలో ఉత్తమ సేవలందించిన ప్రధానోపాధ్యాయురాలు ఎస్ జయశ్రీ, ఆంగ్ల ఉపాధ్యాయుడు ఎస్.ఫాల్గుణరావులను తల్లిదండ్రులు,విద్యార్థుల సమక్షంలో వారి ఉత్తమ సేవలను గుర్తించి వేదమంత్రోచ్ఛారణలు, సన్నాయి సుస్వరాల నడుమ ఘనంగా సత్కరించారు.వారిని సత్కరించినవారిలో పాఠశాల ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, వి.పద్మావతి,దవరశింగి నాగేశ్వరరావు, ఎమ్.అమ్మాజీ,మాతా సత్యనారాయణ,తల్లిదండ్రులు,మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు,విద్యార్థులు పాల్గొన్నారు

## కళ్యాణి పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు.

**గురువులను సత్కరించిన విద్యార్థులు**



**కవిటి (పెన్ సత్తా)**కవిటి పట్టణంలో కల్యాణి ఆంగ్ల పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.భారత మాజీ రాష్ట్రపతి, తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నామని,ఈ సందర్భంగా పాఠశాలలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పాఠశాల ఏవో బల్లెడ.రాణి పూలమాల వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.విద్యార్థులు గురువుల గొప్పతనాన్ని వివరిస్తూ ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం ప్రిన్సిపాల్ పి.బిందుమాధవి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు గురువుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ద్వారంపూడిపై ప్రభుత్వం దృష్టి

కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నిత్యం వివాదాస్పద వ్యాఖ్యలతో నాటి విపక్ష పార్టీలపై విరుచుకుపడిన ద్వారంపూడి చుట్టూ ఉచ్చు బిగుసుకుంటున్నట్లు కనిపిస్తుంది. ఇటీవల పలు కేసుల్లో వైసీపీ నేతలు వరసగా అరెస్ట్ లు అవుతున్నారు. తర్వాత వంతు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిదేనన్న ప్రచారం ఊపందుకుంది. ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో స్థానికంగా ఉన్న జనసేన కార్యకర్తలపై కూడా దాడులు చేయించారన్న ఆరోపణలున్నాయి. అలాగే అనేక భూ వివాదాలు, రేషన్ బియ్యం తరలింపు వంటి ఆరోపణలను ద్వారంపూడి ఎదుర్కొన్నారు. వాటిన్నంటిపై ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విచారణలకు ఆదేశించింది. స్థానిక సంస్థల ఎన్నికలలోపే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిపై చర్యలు తీసుకునే అవకాశాలున్నాయన్న ప్రచారం పెద్దయెత్తున జరగుతుంది. ద్వారంపూడిపై విచారణలు, కేసులను ప్రభుత్వం వేగవంతం చేసింది.ద్వారంపూడిపై

కూటమి ప్రభుత్వ చర్యలు ప్రారంభించింది.కాకినాడ పోర్టు భూముల కుంభకోణం, బియ్యం స్మగ్లింగ్ వంటి వ్యవహారాలపై ఆయనపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి సిద్ధమయినట్లు తెలిసింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయనపై తదుపరి చర్యలు ఉంటాయనే చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తోంది. వరసగా విచారణలు ఒక్కొక్కటిగా పూర్తి కావస్తుండటం ద్వారంపూడిపై క్రిమినల్ చర్యలకు సిఫార్సులు చేస్తుండటంతో నెక్స్ట్ టార్గెట్ ఆయనేనన్న టాక్ మాత్రం రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తుంది. కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి టీడీఆర్ బాండ్ల కుంభకోణం వివాదంలో చిక్కుకుని క్రిమినల్ విచారణను ఎదుర్కొంటున్నారు.టీడీఆర్ బాండ్ల వివాదం మరియు విజిలెన్స్ సిఫార్సులు చేసింది. కాకినాడలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ ప్లాంటు కోసం 23 ఎకరాలు సేకరించాల్సి ఉండగా, కేవలం 4.66 ఎకరాలను మాత్రమే

నకిలీ నోటిఫికేషన్‌తో అత్యవసరంగా సేకరించారన్న ఆరోపణలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా, ఒక నిర్దిష్ట భూ యజమానికి లబ్ధి చేకూర్చేలా వ్యవహరించారని ఆరోపణలు వచ్చాయి.ఈ భూమి ముళ్లపొదలతో, వినియోగానికి పనికిరాని లోతట్టు ప్రాంతంలో ఉన్నప్పటికీ టీడీఆర్ బాండ్లు జారీ చేశారనే విమర్శలున్నాయి.ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. తనపై కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, అక్రమ కేసులు బనాయిస్తున్నారని ద్వారంపూడి వర్గీయులు ఆరోపిస్తున్నారు.

# జనాల్లోకి జై కొట్టు నినాదం




జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ యువ ఓటర్లపై కన్నేశారు. కేవలం స్థానిక సంస్థల ఎన్నికలు మాత్రమే కాదు.. రానున్న ఏ ఎన్నికల్లోనైనా యువత ఓటర్లను ఆకట్టుకోవాలన్న లక్ష్యంగా జనసేన పనిని ప్రారంభించింది. ఇందులో భాగంగా జనసేన యువజన విభాగాన్ని ఆర్భాటంగా పవన్ కల్యాణ్ పుట్టిన రోజు నాడు ప్రారంభించింది. దేశ వ్యాప్తంగా జెన్ జీ ఫీవర్ అన్ని రాజకీయ పార్టీలను పట్టిపీడిస్తుంది. అందులో భాగంగా జనసేన కూడా యువత ఓట్ల కోసం వేట ప్రారంభించింది. పవన్ కల్యాణ్ పై గత రెండేళ్ల నుంచి ఎలాంటి అవినీతి ముద్ర పడలేదు. ఆయన తనకు అప్పగించిన బాధ్యతలను సజావుగా, సమర్థవంతంగా చేస్తున్నారన్న ప్రశంసలను కూడా అందుకుంటున్నారు. అవినీతి మరక అంటకుండా ఉన్న తనకు అండగా నిలబడాలని పవన్ కల్యాణ్ కోరుకుంటున్నారు. యువత అండగా నిలిస్తే విజయం నల్లేరు మీద నడకేనని భావిస్తున్నారు.ఇలాగే తన వైఖరిని కొనసాగిస్తే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నూ జనసేనకు కూటమిలో పొత్తులో భాగంగా అత్యధిక స్థానాలను పొందవచ్చు. యువ నేతలకు పోటీకి అవకాశమిస్తే ప్రజల నుంచి కూడా ఆదరణ లభించే ఛాన్స్ ఉంది. కేవలం కాపు సామాజికవర్గానికి చెందిన ఓటర్ల పైనే ఆధార పడకుండా యువ ఓటర్లను కూడా ఆకట్టుకునే ప్రయత్నం చేయనున్నారు. పవన్ కల్యాణ్ కేరళ నుంచి తిరిగి వచ్చిన వెంటనే యువతతో ప్రత్యేక సమావేశాలను కూడా నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఒకవైపు పార్టీ బలాన్ని పెంచుకోవడం, ఓటు బ్యాంకు పెంచుకోవడంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటితే అసెంబ్లీ ఎన్నికల నాటికి మరింతగా ఎదిగే అవకాశాలు ఉంటాయని జనసేన పార్టీ నాయకత్వం కూడా అంచనా వేస్తుంది. యువత, మహిళ ఓటర్లను ఆకట్టుకోగలిగితే ఇక తనపై సామాజికవర్గం ముద్ర పడకపోయినా పెద్దగా ఉండదని

పవన్ కల్యాణ్ విశ్వసిస్తున్నారు. జైకొట్టు నినాదంతో... జనసేన పార్టీ యువతను, ముఖ్యంగా 'జెన్-జీ' ని ఆకట్టుకోవడానికి ప్రత్యేక వ్యూహాలతో ముందుకు వెళ్తోంది.'జై కొట్టు' యువజన విభాగంపవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా పిఠాపురంలో జనసేన తొలిసారిగా ప్రత్యేక యువజన విభాగాన్ని ఆవిష్కరించింది.'చేయెత్తి జైకొట్టు తెలుగోడా' స్ఫూర్తితో ఈ విభాగానికి 'జై కొట్టు' అని పేరు పెట్టారు.జెన్-జీ యువతను రాజకీయాల్లోకి, సామాజిక కార్యక్రమాల్లోకి భాగస్వామ్యం చేయడమే దీని ప్రధాన లక్ష్యం. నేటి తరానికి తగినట్లుగా ఆలోచనా విధానాన్ని అధ్యయనం చేస్తూ పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా సంభాషణలు సాగించనున్నారు.సోషల్ మీడియాను సమర్థవంతంగా వినియోగించుకుంటూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. సోషల్ మీడియాలో యువత అయితే మరింత పార్టీని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లగలుగుతారన్న నమ్మకంతో ఉన్నారు. మొత్తం మీద జనసేన ఇప్పుడు జెన్ జీ ఆకట్టుకునేందుకు అవసరమైన వ్యూహంతో పవన్ కల్యాణ్ ముందుకు వెళుతున్నారు. మరి పవన్ జెన్ జీ వ్యూహం ఎంత మేరకు ఫలిస్తుందన్నది చూడాలి.

# సుదీర్ఘ పాదయాత్రకు జగన్



ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పాదయాత్ర అనేది కేవలం ఒక ప్రచార సాధనమే కాదు.. అధికార పీఠాన్ని దక్కించుకునే ఒక పొలిటికల్ మాస్టర్ స్ట్రోక్. తండ్రి వైఎస్సార్ అడుగుజాడల్లో నడిచి 2017లో సుదీర్ఘ పాదయాత్ర ద్వారా 2019లో ప్రభంజనం సృష్టించిన వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఇప్పుడు మరొకసారి అదే అస్త్రాన్ని ప్రయోగించేందుకు సిద్ధమవుతున్నారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని 2027 జూలై 8 నుంచి లేదా ఆ తర్వాతి నెలల్లో 2029 ఎన్నికలే లక్ష్యంగా సుదీర్ఘ పాదయాత్రను ప్రారంభించాలని జగన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఏర్పడిన మూడున్నరేళ్ల తర్వాత పూర్తిస్థాయిలో రోడ్డెక్కి, ఎన్నికల దాకా ప్రజల్లోనే ఉండటం ద్వారా ప్రజా మూడ్‌ను తమ వైపు తిప్పుకోవచ్చని వైసీపీ బలంగా నమ్ముతోంది.వైసీపీ అంచనాల ప్రకారం.. ప్రభుత్వ పదవీకాలం చివరి దశకు వచ్చేసరికి కూటమి ప్రభుత్వంపై సహజంగానే కొంత అసంతృప్తి లేదా వ్యతిరేకత మొదలవుతుంది. ఆ సమయానికే సరిగ్గా క్షేత్రస్థాయిలోకి వెళ్లి, ప్రభుత్వం ఇచ్చిన హామీల వైఫల్యాలను ఎండగడుతూ, సంక్షేమ పథకాల కొరతను ఎత్తిచూపితే ప్రజల మూడ్ వేగంగా మారుతుందనేది జగన్ వ్యూహం. గతంలో కూడా 2017 నవంబర్ నుంచి 2019 ఎన్నికల వరకు సుమారు 14 నెలల పాటు నిరంతరం ప్రజల్లో ఉండటం వల్లనే 151 సీట్ల భారీ విజయం సాధ్యమైందని, అదే సెంటిమెంట్‌ను, రాజకీయ వ్యూహాన్ని మళ్లీ పునరావృతం చేయాలని భావిస్తున్నారు.అయితే, 2017 నాటి పరిస్థితులకు, ప్రస్తుత 2027-28 నాటి రాజకీయ పరిస్థితులకు భూమికి ఆకాశానికి ఉన్నంత తేడా ఉందని చాలా మంది చెబుతున్నారు. 2017లో జగన్ ఒక నవ నాయకుడిగా , అవకాశం ఇవ్వాల్సిన కొత్త ఆశాకిరణంగా ప్రజల్లోకి వెళ్లారు. కానీ ఇప్పుడు ఆయన 5 ఏళ్ల పాలనా అనుభవాన్ని, ప్రజా తీర్పును చూసి ప్రతిపక్షంలో కూర్చున్న నాయకుడు. గతంలో తను ఇచ్చిన హామీలు, ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధి లేదా వివాదాలపై కూటమి ప్రభుత్వం ఆయనను క్షేత్రస్థాయిలోనే డిఫెన్స్‌లో పడేసే ప్రమాదం ఉంది. అప్పట్లో అలా చేశారు.. ఇప్పుడు ఇలా అడుగుతున్నారు అనే ప్రశ్నలు ఆయనకు పెద్ద సవాలుగా మారవచ్చు.మరోవైపు, అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి సైతం జగన్ యాత్రను తేలికగా తీసుకునే ప్రసక్తే లేదు. నాడు చంద్రబాబు ఒంటరిగా ఉంటే, నేడు పవన్‌కల్యాణ్ తోడ్పాటు, కేంద్రంలోని బీజేపీ అండదండలు కూటమికి బలంగా ఉన్నాయి. జగన్ పాదయాత్ర ప్రారంభించేనాటికే కౌంటర్ వ్యూహాలతో, ముఖ్యంగా సూపర్‌సిక్స్ హామీల అమలు, క్షేత్రస్థాయి సంక్షేమ ఫలాలను వేగవంతం చేయడం ద్వారా జగన్ పాదయాత్ర మైలేజ్‌ను తగ్గించడానికి కూటమి నాయకత్వం ప్రయత్నిస్తుంది. పైగా, జగన్ పాదయాత్ర వెళ్లే మార్గాల్లో ఎదురయ్యే ప్రజా నిలదీతలను తిప్పికొట్టడం వైసీపీ కేడర్‌కు పరీక్షగా మారనుంది. దీనికితోడు వైసీపీలో ఉన్న ప్రధాన లోపం ద్వితీయ శ్రేణి నాయకత్వం వికేంద్రీకరణ . ఒకప్పుడు జగన్ వెనక నడిచిన సీనియర్ నేతలలో కొందరు నిశ్శబ్దంగా ఉండటం, మరికొందరు పార్టీ వీడటం వల్ల క్షేత్రస్థాయి యంత్రాంగం బలహీనపడింది. కేవలం జగన్ ఇమేజ్ మీదనే మళ్లీ గెలవడం కష్టమని, బలమైన నియోజకవర్గ స్థాయి నేతలు లేకపోతే పాదయాత్ర తెచ్చిపెట్టే ఉత్సాహం ఓట్లుగా మారడం కష్టమనే అభిప్రాయం ఉంది. కేడర్‌లో మళ్లీ జోష్ నింపడం, నైరాశ్యంలో ఉన్న నేతలకు భరోసా ఇవ్వడం జగన్ ముందున్న తక్షణ కర్తవ్యం. ప్రతీసారి పాదయాత్ర ఒకే రకమైన ఫలితాన్ని ఇస్తుందనుకోవడం పొరపాటే. ప్రతిపక్ష నేతగా ప్రజల వద్దకు వెళ్లినప్పుడు వారి సమస్యలకు పరిష్కారం చూపే స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను, విశ్వసనీయతను చూపించగలిగితేనే పాదయాత్ర సక్సెస్ అవుతుంది. పాత ఫార్ములానే నమ్ముకోకుండా, సరికొత్త హామీలతో, పొరపాట్లను సరిదిద్దుకుంటూ జగన్ ప్రజల్లోకి వెళితేనే ఈ పాదయాత్ర 2.0 వైసీపీని మళ్లీ రేసులోకి తీసుకెళ్లే అవకాశాలు ఉంటాయి

# బెజవాడ మేయర్ రేసులో వంగవీటి రాధా

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు గుండెకాయ వంటి విజయవాడ నగరంలో ఊహించని రాజకీయ పరిణామాలు ఊపందుకుంటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు సంబంధించిన స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ త్వరలోనే వెలువడే సూచనలు కనిపిస్తుండటంతో అధికార, ప్రతిపక్ష శిబిరాల్లో కదలిక మొదలైంది. ఈ తరుణంలో టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నుంచి వంగవీటి మోహన రంగా తనయుడు, సీనియర్ నేత వంగవీటి రాధాకృష్ణకు ప్రత్యేక పిలుపు రావడం బెజవాడ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. సీఎం చంద్రబాబుతో రాధా త్వరలోనే భేటీ కానున్నారన్న వార్త విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమీకరణాలను పూర్తిగా మార్చేలా కనిపిస్తోంది.రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లకు ఈసారి కౌన్సిలర్లు కాకుండా, ప్రజలే నేరుగా ఓటు వేసి మేయర్లను ఎన్నుకునే ప్రత్యక్ష ఎన్నికల పద్ధతి ని ప్రవేశపెట్టాలని కూటమి ప్రభుత్వం గట్టిగా యోచిస్తోంది. విజయవాడ నగర కార్పొరేషన్ భౌగోళికంగా తూర్పు, పశ్చిమ, మధ్య నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉంది. అంటే, ప్రత్యక్ష పద్ధతిలో మేయర్‌గా పోటీ చేయడమంటే దాదాపు మూడు అసెంబ్లీ స్థానాల విస్తీర్ణంలో, లక్షలాది మంది ఓటర్లను నేరుగా ఎదుర్కోవాల్సి రావడం. ఇంతటి విస్తృతమైన పరిధిలో కేవలం పార్టీ గుర్తు మాత్రమే సరిపోదని, నగరం మొత్తాన్ని ప్రభావితం చేయగల బలమైన ప్రజాదరణ, మాస్ ఇమేజ్ ఉన్న నాయకుడిని బరిలోకి దించితేనే విజయం నల్లేరుపై నడక అవుతుందని టీడీపీ అగ్రనాయకత్వం ఒక నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం.విజయవాడ నగర సామాజిక, రాజకీయ ముఖచిత్రంలో వంగవీటి కుటుంబానికి తరగని అభిమాన గణం ఉంది. రంగా పేరు వింటే నేటికీ బెజవాడలో ఒక ప్రత్యేకమైన ఉద్వేగం కనిపిస్తుంది. కాపు సామాజిక వర్గంతో పాటు ఇతర దిగువ, మధ్యతరగతి ప్రజల్లోనూ, యువతలోనూ రాధాకు మంచి ఆదరణ ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి విజయానికి విస్తృతంగా ప్రచారం నిర్వహించినప్పటికీ, అప్పట్లో సీట్ల సర్దుబాటు వల్ల రాధాకు ప్రత్యక్షంగా టికెట్ లభించలేదు. ఆ తర్వాత ప్రభుత్వం ఏర్పడినప్పటికీ ఆయన ఎలాంటి పదవినీ ఆశించలేదు. ఇప్పుడు స్వయంగా మూడు నియోజకవర్గాల సమానమైన మేయర్ పీఠానికి ఆయనను బరిలో దింపడం ద్వారా ఆయన స్థాయిని తగ్గించకుండానే సరైన గౌరవం ఇచ్చినట్లవుతుందని కూటమి పెద్దలు భావిస్తున్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో జరగబోయే కీలక భేటీలో ప్రధానంగా మేయర్ అభ్యర్థిత్వం గురించే చర్చించనున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ప్రత్యక్షంగా మేయర్ రేసులో నిలబడేందుకు రాధా సిద్ధంగా ఉన్నారా లేదా ఆయన ఆలోచనలు ఎలా ఉన్నాయన్నది చంద్రబాబు నేరుగా తెలుసుకోనున్నారు. ఒకవేళ రాధా నేరుగా పోటీకి విముఖత చూపితే, ఆయన కుటుంబానికి చెందిన వారిని బరిలోకి దింపి, రాధాకు త్వరలోనే ఎమ్మెల్సీ లేదా ప్రభుత్వంలో సముచిత కార్పొరేషన్ పదవి ఇచ్చే ప్రత్యామ్నాయ ప్రతిపాదనలపై కూడా చర్చ జరుగుతోందని టాక్. ఒకవేళ చంద్రబాబు ప్రతిపాదనకు రాధా గ్రీన్ సిగ్నల్ ఇస్తే పోటీ ఖాయమని అనుకోవచ్చు

# గోదావరి కాలుష్యం... యాక్షన్ కి పవన్ రెడీ !



ఏపీ కూటమిలో ఉప ముఖ్యమంత్రిగా పవన్ కీలక స్థానంలో ఉన్నారు. అంతే కాదు ఆయన చేతిలో అయిదు ముఖ్య శాఖలు ఉన్నాయి. వాటిలో పర్యావరణం కాలుష్య నియంత్రణ శాఖలు కూడా ఉన్నాయి. దాంతో పవన్ ఈ శాఖల మీద ఎక్కువ ఫోకస్ పెడుతున్నారు. గతంలో ఈ శాఖలకు మంత్రులు ఉన్నా ఇంతలా వీటి గురించి చర్చించుకునేందుకు వీలు అయితే లేదనే అంటున్నారు. కానీ పవన్ కి పర్యావరణం మీద ప్రేమ ఉంది, కాలుష్యాన్ని వీలైనంతగా నియంత్రించాలని పట్టుదల ఉంది. అందుకే ఈ శాఖలు తరచూ వార్తలలోకి వస్తున్నయి. ఇక ప్రత్యేకించి ఈ శాఖల మంత్రిగా పవన్ జిల్లాలలో పర్యటిస్తూ ఎక్కడ ఉల్లంఘనలు జరిగాయో స్వయంగా తనిఖీలు చేసి మరీ ఆయా సంస్థలకు హెచ్చరికలు జారీ చేస్తూ వస్తున్నారు. ఈ మధ్యనే ఆయన రాజమండ్రీలో పర్యటించి మరీ ఆంధ్రా పేపర్ మిల్స్ వల్లనే గోదావరి నదిలో కాలుష్యం అధికం అయింది అన్నది గుర్తించారు. అయితే మొదటి తప్పుగా సంస్థకు హెచ్చరించి పరిష్కార మార్గాలని సూచించినా సంస్థ నుంచి స్పందన రాలేదని అంటున్నారు. దాంతో పవన్ ఇపుడు ఈ సంస్థ మీద చర్యలకు దిగాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లుగా చెబుతున్నారు.

**సగం కాలుష్యం వాటా :**

రాజమండ్రీ నగరంలో రోజుకు 70 మిలియన్ లీటర్ల ద్రవ్య వ్యర్థాలు విడుదల అవుతూంటే అందులో సగానికి సగం 35 మిలియన్ లీటర్లు ఆంధ్రా పేపర్ మిల్స్ నుంచే వస్తున్నాయని కాలుష్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అంతే కాదు 2016 తరువాత కాతేరు గ్రామ పంచాయతీకి అలాగే రాజమండ్రి కార్పోరేషన్ కి ఒక్క పైసా కూడా పన్ను ఈ సంస్థ చెల్లించలేదని కూడా గుర్తించింది అంటున్నారు. అలా స్థానిక సంస్థలకు 21.34 కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉందని అధికారుల వద్ద లెక్క ఉంది. పన్నులు చెల్లించాలని నోటీసులు ఇచ్చిన ప్రతీ సారీ కోర్టుని ఆశ్రయిస్తూ కాలయాపన చేస్తున్నారు అని కూడా కాలుష్య మంత్రిత్వ శాఖ చెబుతోంది.

**నీటిలో ఆక్సిజన్ తగ్గింది :**

సదరు సంస్థ నుంచి గోదావరిలోకి నేరుగా కలుస్తున్న ద్రవ వ్యర్థాల కారణంగా నీటిలో కాలుష్యం పేరుకుని పోయి ఆక్సిజన్ శాతం గణనీయంగా తగ్గిపోయింది అని కూడా నివేదికలు వెల్లడిస్తున్నాయి. దాంతో జల చరాలు నదిలో మనుగడకు ఇబ్బందికరంగా ఈ పరిస్థితులు మారుతున్నాయని అంటున్నారు. ఇక దుర్గంధంతో పాటు గోదావరి నీటిలో నాణ్యతా ప్రమాణాలు పడిపోయి నగర ప్రజల ఆరోగ్యం జీవన ప్రమాణాల మీద అధికంగా ప్రభావం చూపిస్తోంది అని నివేదిక వెల్లడిస్తోంది.

**తక్షణం సమన్లు జారీ :**

ఈ పరిస్థితుల్లో మూడు నెలల క్రితం క్షేత్ర స్థాయి పర్యటన చేపట్టి హెచ్చరించినా సదరు సంస్థలో మార్పు లేదని అధికారులు పలు మార్లు సూచనలు చేసినా పాటించలేదని ఉప ముఖ్యమంత్రి పవన్ ఆగ్రహం వ్యక్తం చేశారని అంటున్నారు. ఇక ఉపేక్షించేది లేదని తక్షణం ఆ సంస్థకు సమన్లు జారీ చేసి చర్యలకు ఉపక్రమించాలని పవన్ సంబంధింత అధికారులకు ఆదేశాలు జారీ చేశారని అంటున్నారు. ఇక న్యాయపరంగా కూడా ప్రభుత్వం నుంచి అడ్వకేట్ జనరల్ అదనపు అడ్వకేట్ జనరల్ స్టాండింగ్ కౌన్సిల్ కి ఈ కాలుష్య ఉల్లంఘన కేసుల విచారణను త్వరితగతిన పూర్తి చేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని పవన్ ఆదేశించారు.

**మద్దతు ఇవ్వాలి :**

ఇక వచ్చే ఏడాది 2027 జూలైలో జరిగే గోదావరి పుష్కరాల నాటికి నదిని పవిత్రంగా కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు పౌర సమాజంతో పాటు పర్యావరణవేత్తల నుంచి మద్దతు ఇవ్వాలని పవన్ కోరడం విశేషం. ప్రజా ప్రయోజనాలతో పాటు పర్యావరణ హితానికి అత్యధిక ప్రాధాన్యత కూటమి ప్రభుత్వం ఇస్తుందని పవన్ స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదని కూడా తేల్చి చెప్పారు.

## బిజినెస్

### కలిసొచ్చిన ఏఐ రంగం..
### 15 ట్రిలియన్ డాలర్లకు చేరిన కుబేరుల సంపద




కృత్రిమ మేధ కారణంగా ఒకవైపు చాలామంది ఉద్యోగాలు కోల్పోతుంటే.. మరోవైపు పెద్ద పెద్ద కంపెనీలు భారీగా సంపద సృష్టిస్తున్నాయి. ఏఐ రంగంలో పెట్టుబడులు కలసిరావడంతో ప్రపంచవ్యాప్తంగా సంపన్నుల జనాభా పెరుగుతోంది. గతేడాది బిలియనీర్ల సంఖ్య దాదాపు 3800కు చేరినట్లు గ్లోబల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ అల్ట్రాటా తన వెల్త్ రిపోర్ట్‌లో వెల్లడించింది. వీరి మొత్తం సంపద సుమారు 15.1 ట్రిలియన్ డాలర్లకు (భారత కరెన్సీ ప్రకారం.. రూ.1,417.37 లక్షల కోట్లు) చేరుకున్నట్లు తెలిపింది. గత 5 ఏళ్లలో ఏఐ రంగంలో సగటున 30 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.283.25 కోట్లు) వరకు పెట్టుబడులు చేసిన కంపెనీలు అధిక మార్కెట్ విలువను సాధించాయని అల్ట్రాటా తన నివేదికలో పేర్కొంది. దీంతో బిలియనీర్ల సంపద 12.8 శాతం పెరగ్గా.. కుబేరుల సంఖ్య 8.2 శాతం ఎగబాకింది. ఏఐ రంగానికి సంబంధించిన టెక్నాలజీ స్టాక్స్‌లో పెట్టుబడులు భారీ సంపద సృష్టించాయని నివేదిక వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కుబేరుల మొత్తం సంపదలో.. 27శాతం కేవలం 29 మంది సూపర్ బిలియనీర్ల (50 బిలియన్ డాలర్లను మించి ఆదాయం ఉన్న వారిని ఇలా పరిగణిస్తారు) వద్దే ఉన్నట్లు పేర్కొంది. అత్యధికంగా 1,337 మంది బిలియనీర్లతో ఉత్తర అమెరికా మొదటి స్థానంలో నిలవగా, 1,081 మందితో ఐరోపా రెండో స్థానంలో ఉంది. ఆసియాలో 881 మంది బిలియనీర్లు ఉన్నారు. మొత్తం సంపన్నుల్లో మహిళలు కేవలం 13 శాతం మాత్రమే ఉండడం గమనార్హం.

### కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్‌కు దరఖాస్తులు వచ్చాయి: కేంద్రం క్లారిటీ

కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్‌కు ఆదరణ లభించలేదంటూ వచ్చిన వార్తల్ని కేంద్రం ఖండించింది. రూ.37,500 కోట్ల ప్రోత్సాహక పథకం కింద ఈ ప్రాజెక్ట్ ఏర్పాటుకు ఎవరూ ముందుకు రాలేదన్న వాదనను తోసిపుచ్చింది. అవన్నీ అవాస్తవాలని, ఇలాంటి అసత్యాలు ప్రాజెక్ట్‌పై ఎలాంటి ప్రభావం చూపబోవని బొగ్గు గనుల మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు తాల్చేర్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ ఎన్‌టీపీసీ నుంచి ఇప్పటికే దరఖాస్తులు వచ్చాయని బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కంపెనీల నుంచి ఒక్క దరఖాస్తు కూడా రాలేదన్న వాదనను తోసిపుచ్చిన కేంద్రం.. తొలి రౌండ్ అప్లికేషన్ విండో ప్రక్రియ సెప్టెంబర్ 7న ముగుస్తుందని స్పష్టం చేసింది. ఈ స్కీమ్‌లో భాగంగా దాదాపు 25 ప్రాజెక్టులకు గానూ.. రూ.2.5- 3 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తోంది. తద్వారా 50 వేల ఉద్యోగాలు సృష్టించొచ్చని భావిస్తోంది. 2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గును గ్యాసిఫికేషన్ చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. భారత్ ఇంధన అవసరాలకు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలనే ఉద్దేశంతో దేశీయ బొగ్గు నిల్వలను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు 'బొగ్గు వాయువీకరణ (కోల్ గ్యాసిఫికేషన్)' ప్రక్రియకు కేంద్రం సంకల్పించింది.

## ప్రపంచ కళలకు భారతీయ వేదిక.. ఎన్‌మ్యాక్



భారతీయ కళలు, సంస్కృతికి అంతర్జాతీయ వేదికగా.. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన కళా ప్రదర్శనలు, సంగీత, నాటక ప్రదర్శనలను భారత ప్రేక్షకులకు చేరువ చేసే కేంద్రంగా నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్ (ఛీహీాజజ) తన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. ముంబైలో 2023 మార్చిలో ప్రారంభమైన ఈ సాంస్కృతిక కేంద్రం మూడేళ్ల ప్రస్థానంలో ఎన్నో ఘనమైన కళా వేడుకలకు వేదికను పంచింది. మూడేళ్లలో ఎన్‌మ్యాక్‌లో 3,500కు పైగా ప్రదర్శనలు జరిగాయి. దాదాపు 25 లక్షల మంది ప్రేక్షకులు సందర్శించగా.. సంగీతం, నాటకం, నృత్యం, దృశ్యకళ తదితర రంగాలకు చెందిన 10,500 మందికి పైగా కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. 15కుపైగా భాషల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించడం విశేషం. నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్‌లోని గ్రాండ్ థియేటర్ అంతర్జాతీయ స్థాయి ప్రదర్శనలకు వేదికగా నిలిచింది. ది సౌండ్ ఆఫ్ మ్యూజిక్, వెస్ట్ సైడ్ స్టోరీ, మమ్మా మియా, ది ఫ్యాంటమ్ ఆఫ్ ఒపేరా, విక్‌డ్ వంటి ప్రపంచ ప్రసిద్ధ ప్రొడక్షన్స్ ఇక్కడ ప్రేక్షకులను అలరించాయి. అదే వేదికపై మొఘల్-ఎ-ఆజమ్: ది మ్యూజికల్, రాజాధిరాజ్: లవ్. లైఫ్. లీలాతో పాటు ఎన్‌మ్యాక్ ఒరిజినల్ ప్రొడక్షన్ ది గ్రేట్ ఇండియన్ మ్యూజికల్: సివిలైజేషన్ టు నేషన్ వంటి భారతీయ ప్రదర్శనలు సైతం ఘనంగా సాగాయి.

స్టూడియో థియేటర్, ది క్యూబ్ వేదికలు చిన్న స్థాయి, ప్రయోగాత్మక ప్రదర్శనలకు ప్రత్యేక స్థానం కల్పించాయి. థియేటర్, సంగీతం, కామెడీ, నృత్యం తదితర విభాగాల్లో హిందీ, గుజరాతీ, మరాఠీ, బెంగాలీ సహా పలు భాషల్లో కార్యక్రమాలు నిర్వహించారు.

దృశ్యకళల పరంగా ఎన్‌మ్యాక్‌లోని ఆర్ట్ హౌస్ అంతర్జాతీయ కళా ప్రపంచాన్ని ముంబైకి తీసుకొచ్చింది. లండన్‌లోని నేచరల్ హిస్టరీ మ్యూజియంతో కలిసి వైల్డ్‌లైఫ్ ఫోటోగ్రాఫర్ ఆఫ్ ది ఇయర్, దియా ఆర్ట్ ఫౌండేషన్ సహకారంతో లైట్ ఇన్‌టు స్పేస్, భక్తి, బల్గరీ సెర్పెంటి ఇన్ఫినిటో వంటి ప్రదర్శనలు నిర్వహించింది. ప్రస్తుతం సెకెండ్ నేచర్ పేరుతో కొనసాగుతున్న ప్రదర్శనలో టీమ్‌ల్యాబ్, ఎ.ఎ.మురకామి, ఈఎస్ డెవ్లిన్, ర్యాండమ్ ఇంటర్‌నేషనల్ తదితర కళాకారులు, స్టూడియోల తొమ్మిది భారీ స్థాయి ఇన్‌స్టాలేషన్లు ఉన్నాయి. ఈ ప్రదర్శన 2027 జనవరి వరకు కొనసాగనుంది. అంతర్జాతీయ కళా రంగంతో ఎన్‌మ్యాక్ అనుబంధం ముంబైకే పరిమితం కాలేదు. 61వ వెనిస్ బియన్నాలేలో ఇండియా పెవిలియన్‌ను ప్రదర్శించేందుకు భాగస్వామ్యం చేయడం ద్వారా భారత సమకాలీన కళాకారులకు అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభించే అవకాశాన్ని కల్పించింది. ఈ కార్యక్రమంలో ఐదుగురు సమకాలీన భారతీయ కళాకారులను ప్రపంచ ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లింది. ఎన్‌మ్యాక్ నాలుగో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న వేళ భారతీయ, అంతర్జాతీయ కళా ప్రపంచాల మధ్య ఈ సాంస్కృతిక మార్పిడి మరింత విస్తరించనుంది. రానున్న రోజుల్లో 'ది గ్రేట్ ఇండియన్ మ్యూజికల్: సివిలైజేషన్ టు నేషన్' తిరిగి ప్రదర్శితం కానుండగా.. చికాగో రానుంది. అలాగే ఆస్కార్ నామినీ సంగీత దర్శకుడు మ్యాక్స్ రిక్టర్ తొలిసారి భారత్‌లో ప్రదర్శన ఇవ్వనున్నారు. దీంతో భారత ప్రేక్షకులకు ప్రపంచ స్థాయి కళా అనుభవాలను అందించడంతో పాటు, భారతీయ కళలు, కథనాలకు అంతర్జాతీయ వేదిక కల్పించే ఎన్‌మ్యాక్ పాత్ర మరింత బలోపేతం కానుంది.

## జాగ్వార్ ల్యాండ్ రోవర్ కంపెనీలో 4వేల ఉద్యోగాలు కోత!



టాటా మోటార్స్‌కు చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్ భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగించే యోచనలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. రాబోయే రెండేళ్లలో బ్రిటన్‌లో దాదాపు 4 వేల ఉద్యోగాలకు కోత విధించనున్నట్లు 'ది టైమ్స్' కథనం పేర్కొంది. అమెరికా టారిఫ్‌లు, వాహన తయారీ ఖర్చులు పెరగడం, విక్రయాలు తగ్గడమే ఇందుకు కారణమని తెలిపింది. మరోవైపు, ఉద్యోగాల కోతకు సంబంధించి ఇప్పటికే సిబ్బందికి సమాచారం అందజేశామని, త్వరలోనే ఇందుకు సంబంధించిన ప్రకటన వెలువడనున్నట్లు కంపెనీ పేర్కొన్నట్లు సదరు వార్తా కథనం తెలిపింది. ఆర్థికపరమైన అంశాలకు తగ్గట్టుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వేతన సిబ్బంది, మేనేజ్‌మెంట్ టీమ్‌లపై ఈ ప్రభావం పడే అవకాశం ఉంది. కాగా, బ్రిటన్‌లో అతిపెద్ద కార్ల తయారీ సంస్థల్లో ఒకటైన జేఎల్‌ఆర్ సంస్థ.. బ్రిటన్‌లో సుమారు 34 వేల మందికి ఉపాధి కల్పిస్తోంది. ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి అయ్యే భారీ వ్యయం, చైనా నుంచి ఎదురవుతున్న తీవ్రమైన పోటీ, అంతర్జాతీయ ఆంక్షల ఒత్తిళ్లను తట్టుకొనేందుకే కంపెనీ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. ఈ ఏడాది జూన్ చివరి నాటికి కంపెనీ ఆదాయం దాదాపు 10 శాతం వరకు తగ్గడం గమనార్హం. మరోవైపు, జర్మనీ కార్ల తయారీ దిగ్గజం ఫోక్స్‌వ్యాగన్ కూడా లక్ష ఉద్యోగాలకు కోత విధిస్తున్నట్లుగా ప్రకటించిన సంగతి తెలిసిందే.

## బీసీసీఐకి షాకిచ్చిన ఒలింపిక్ సంఘం..

### క్రికెటర్లకు వసతులపై కీలక సూచన..!




ఆసియా క్రీడల్లో క్రికెటర్ల సౌకర్యార్థం మౌలిక వసతులు లేకపోవడంపై అసంతృప్తితో ఉన్న బీసీసీఐకి భారత ఒలింపిక్ సంఘం షాకిచ్చింది. జపాన్‌లోని ఐచీ- నగోయాలో టెంట్‌లోనే డ్రెస్సింగ్ రూమ్, 500 మీటర్ల దూరంలో వాష్‌రూమ్‌పై భారత బోర్డు ఫిర్యాదును తిరస్కరించింది. నిర్వాహకులు ఏర్పాటు చేసిన వాటితోనే సర్దుకుపోవాలని సూచించింది ఐఓఏ. ఒకవేళ టీమిండియా క్రికెటర్లకు ఇబ్బందిగా ఉంటుందని భావిస్తే.. సొంత ఖర్చుతో ఏర్పాట్లు చేసుకోవచ్చని పేర్కొంది. దాంతో.. టోర్నీ నిర్వాహకులను నమ్ముకునే కంటే భారత ప్లేయర్ల కోసం మెరుగైన వసతులు కల్పించడంపై బీసీసీఐ దృష్టి సారించనుంది. సెప్టెంబర్ 19వ తేదీ నుంచి జపాన్ వేదికగా ఆసియా క్రీడలు మొదలవ్వనున్నాయి. అయితే.. ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొనే అథ్లెట్లు, క్రికెటర్లకు వసతులు, ఏర్పాట్లు మాత్రం ఆశించిన స్థాయిలో లేవు. టెంట్లలో లేదా కంటైనర్లలో వసతి, ఆమడ దూరంలో టాయిలెట్లు.. వంటివి క్రికెటర్లకు అసౌకర్యాన్ని కలిగిస్తాయని వాపోతున్న బీసీసీఐకి కీలక సూచన చేసింది భారత ఒలింపిక్ సంఘం. టైమ్ ఆఫ్ ఇండియా కథనం ప్రకారం.. వసతులపై అభ్యంతరం ఉంటే సొంతంగా ఏర్పాటు చేసుకునేందుకు అభ్యంతరం చెప్పబోమని బీసీసీఐకి ఐఓఏ స్పష్టం చేసింది. 'బీసీసీఐ సీఈవో హేమంగ్ అమిన్ మాతో టచ్‌లో ఉన్నారు. జపాన్‌లో వసతుల పరిశీలన కోసం బీసీసీఐ ఓ బృందాన్ని పంపిస్తోంది. అందుకు మాకు అభ్యంతరం లేదు. ఆసియా క్రీడల్లో ఇలా వసతులపై ఫిర్యాదులు రావడం ఇదే మొదటిసారి. భారత బృందాన్ని ఒకేలా చూస్తాం. అందుకే క్రికెటర్లకు వసతుల్లో మార్పులు చేయలేం. ఈ పరిస్థితుల్లో అథ్లెట్ల మంచీచెడూ బీసీసీఐ చూసుకోనుంది. వసతుల పరంగా కొత్త మార్పులేవీ ఉండబోవని భారత ఒలింపిక్ సంఘం స్పష్టం చేసినట్టు సమాచారం. నిర్వాహకులు ఏర్పాటు చేసిన చోటనే బస చేయాలి. 'మా వల్ల కాదంటే మాత్రం.. సొంతంగా ఏర్పాటు చేసుకోవచ్చు' అని బీసీసీఐకి ఐఓఏ తేల్చి చెప్పింది' అని ఐఓఏ సీఈవో రఘురామ్ అయ్యర్ వెల్లడించారు. 'జపాన్‌లో ఆసియా క్రీడల ఏర్పాట్ల పట్ల ఏసీసీ, బీసీసీఐ సంతృప్తిగా లేవు. అందుకని పరిశీలకులను జపాన్ పంపిస్తాం. వారు అక్కడి పరిస్థితులపై మాకు నివేదిక ఇస్తారు. టెంట్లలో డ్రెస్సింగ్ రూమ్ ఏర్పాటు చేశారని, వాష్‌రూమ్‌లు 500 మీటర్ల దూరంలో ఉన్నాయి. దాంతో, క్రికెటర్లు అసౌకర్యానికి గురవుతారనే విషయాన్ని ఏసీసీ సమావేశంలో జపాన్ ఒలింపిక్ అధికారుల దృష్టికి తీసుకొచ్చాం. అంతేకాదు హోటల్ గదులు కూడా చిన్నగా ఉన్నాయి' అని బీసీసీఐ వర్గాలు ఏఎన్ఐతో పేర్కొన్న విషయం తెలిసిందే. టోర్నీ ఆరంభం కల్లా పరిస్థితిలో మార్పు లేకుంటే బీ టీమ్‌ను పంపాలని బీసీసీఐ ఆలోచిస్తున్నట్టు కథనాలు వచ్చాయి. అయితే.. భారత బోర్డు మాత్రం ఈ విషయమై ఎలాంటి ప్రకటన చేయలేదు. భారత పురుషుల స్క్వాడ్ -- శ్రేయాస్ అయ్యర్(కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, సంజూ శాంసన్(వికెట్ కీపర్), అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), శివం దూబే, తిలక్ వర్మ(వైస్ కెప్టెన్), వాషింగ్టన్ సుందర్, నితీశ్ రెడ్డి, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, హర్షిత్ రానా, అర్ష్‌దీప్, బుమ్రా. భారత మహిళల స్క్వాడ్ -- హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్) స్మృతి మంధాన(వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, దీప్తి శర్మ, ప్రతీకా రావల్, రీచా ఘోష్(వికెట్ కీపర్), జి.కమలిని(వికెట్ కీపర్), భారతి ఫుల్‌మాలి, శ్రీచరణి, రేణుకా సింగ్, క్రాంతి గౌడ్, అరుంధతి రెడ్డి, శ్రేయాంక పాటిల్, రాధా యాదవ్, నందిని శర్మ.

### కేఎల్ లేకపోయినా దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు మేం సిద్ధం



ంటర్నెట్ డెస్క్: దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు సర్వం సిద్ధమైంది. ఆదివారం నుంచే ఈస్ట్ జోన్, సౌత్ జోన్ జట్ల మధ్య తుది పోరు జరగనుంది. తిలక్ వర్మ నాయకత్వంలోని సౌత్ జోన్ జట్టులో సిరాజ్, దేవదత్ పడిక్కల్ ఆడటం ఖాయమే. అయితే, కేఎల్ రాహుల్ రాకపై సందిగ్ధత ఉంది. రాహుల్ ఈ మ్యాచ్‌లో ఆడటం లేదని తిలక్ వెల్లడించాడు. ఫైనల్ నేపథ్యంలో ఇరు జట్ల కెప్టెన్లు తిలక్, ఇషాన్ కిషన్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. "సీనియర్ పేసర్ షమీని అడ్డుకొనేందుకు సిద్ధంగానే ఉన్నాం. ఈ మ్యాచ్ రసవత్తరంగానే ఉండబోతోంది. గత మ్యాచ్‌లో షమీ ఎలా బౌలింగ్ చేశాడో మేం గమనించాం. బ్యాటర్లను ఇబ్బంది పెడుతూ లైన్ అండ్ లెంగ్త్‌తో కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తాడు. అతడి బౌలింగ్‌ను ఎదుర్కొని సత్తా చాటుతాం" అని తిలక్ వర్మ తెలిపాడు. "మహ్మద్ షమీ అత్యుత్తమ ప్లేయర్. బెంగాల్ తరఫున ఆడేటప్పటి నుంచి అద్భుతమైన ప్రదర్శన చేస్తున్నాడు. వికెట్లు తీయడంతోపాటు మైదానంలో తన శక్తినంతా వినియోగిస్తాడు. భారత క్రికెట్‌కూ ఎన్నో సేవలు అందించాడు. ఇప్పుడందరూ వయసు గురించి మాట్లాడుతున్నారు. కానీ, అది కేవలం ఒక నంబర్ మాత్రమే. అతడి కష్టం గురించి ఎవరూ అనడం లేదు. ఇప్పటికీ షమీ భాయ్‌లో వికెట్ల దాహం తీరలేదు" అని ఇషాన్ తెలిపాడు. షమీతోపాటు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఎలా ఆడతాడనేది ఆసక్తికరంగా మారింది. సెమీస్‌లో అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ దులీప్ ట్రోఫీ ఫైనల్‌ను చూసేందుకు చెన్నై వెళ్లనున్నాడు. అతడి పదవీకాలంపై ఇటీవల పెద్ద చర్చే జరిగింది. అక్టోబర్ 4 వరకు ఉన్నప్పటికీ.. వచ్చే ఏడాది వరల్డ్ కప్ వరకూ పొడిగింపు ఉండే అవకాశం ఉంది. ఆ విషయంపై చెన్నైలో బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా - అగార్కర్ మధ్య సమావేశం జరగనుంది. ఇటీవల రివ్యూ మీటింగ్‌కు వ్యక్తిగత కారణాల వల్ల అగార్కర్ గైర్హాజరైన సంగతి తెలిసిందే. ఇక ఆసియా గేమ్స్ (గాంఖుఅ +ఖుఎవం) కోసం భారత్ మరో రెండు వారాల్లో జపాన్‌కు వెళ్లనుంది. జట్టుతోపాటు అదనంగా మరికొందరిని నెట్ బౌలర్లుగా పంపించాలని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. మయాంక్ యాదవ్, కార్తిక్ త్యాగితోపాటు మోసిన్ ఖాన్ అవకాశం ఇవ్వనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆసియా క్రీడలకు హెడ్ కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్న వీవీఎస్ లక్ష్మణ్ విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

## స్పోర్ట్స్

### వాళ్లిద్దరి రాకతో
### మా జట్టు మరింత బలపడింది



దేశవాళీ ప్రతిష్టాత్మక రెడ్ బాల్ టోర్నమెంట్ దులిప్ ట్రోఫీ-2026 ఫైనల్‌కు రంగం సిద్ధమైంది. చెన్నైలోని చెపాక్ స్టేడియం వేదికగా ఈస్ట్ జోన్- సౌత్ జోన్ టైటిల్ పోరులో అమీతుమీ తేల్చుకుంటాయి. ఈ నేపథ్యంలో సౌత్ జోన్ జట్టుకు శుభవార్త అందింది. టీమిండియా స్టార్లు మహ్మద్ సిరాజ్, దేవదత్ పడిక్కల్ జట్టుతో చేరారు. సౌత్ జోన్ కెప్టెన్, టీమిండియా బ్యాటర్ తిలక్ వర్మ శనివారం ధ్రువీకరించాడు. పడిక్కల్ మూడో స్థానంలో బ్యాటింగ్ చేస్తాడని తెలిపాడు. మ్యాచ్‌కు ముందు విలేకరులతో మాట్లాడుతూ..

మరింత పటిష్టంగా "పడిక్కల్ రాకతో మా బ్యాటింగ్ లైనప్ మరింత పటిష్టంగా మారింది. గత రెండు, మూడు మ్యాచ్‌లలో అతడు అద్భుత ఫామ్‌ను కొనసాగించాడు. నిజంగా అతడు రావడం మా జట్టుకు అదనపు బలం. ఇక సిరాజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. మా బౌలింగ్ విభాగానికి సిరాజ్ బలంగా మారాడు. తన అనుభవాన్ని యువ ఆటగాళ్లతో పంచుకున్నాడు. మా జట్టులోని కొంత మంది జూనియర్ ఆటగాళ్లకు ఇదొక అదనపు ప్రయోజనం.

**ఓపెనర్లుగా వాళ్లే**

ఇక ఇంతకుముందు రికీ భుయ్ ఓపెనర్‌గా వచ్చాడు. అయితే, అతడు మిడిలార్డర్‌లో ఆడుతున్నాడు. ఇప్పుడు జగ్గీ (జగదీశ్ నారాయణన్)తో కలిసి మరోసారి ఓపెనింగ్ చేస్తాడు. జట్టు ప్రయోజనాలకు అనుగుణంగా సీనియర్ ప్లేయర్ రికీ భుయ్ సేవలు వాడుకుంటున్నాము" అని తిలక్ వర్మ తెలిపాడు.

**నో రాహుల్**

కాగా పడిక్కల్ వన్‌డౌన్‌లో ఆడుతుండటంతో.. ఆంధ్ర ప్లేయర్ షేక్ రషీద్‌పై వేటు పడింది. కీలక సెమీస్ మ్యాచ్‌లో అతడు (0,1) పూర్తిగా విఫలమయ్యాడు. ఇదిలా ఉంటే.. పడిక్కల్, సిరాజ్‌లతో పాటు టీమిండియా టెస్టు వైస్ కెప్టెన్ కేఎల్ రాహుల్ కూడా సౌత్ జోన్ తరఫున దులిప్ ట్రోఫీ ఫైనల్లో ఆడతాడనే ప్రచారం జరిగింది. అయితే, తిలక్ వర్మ మాత్రం జగ్గీ-రికీ భుయ్ ఓపెనర్లుగా వస్తారని.. పరోక్షంగా ఈ ప్రచారాన్ని ఖండించాడు. ఇదిలా ఉంటే.. టీమిండియా ఇటీవలే శ్రీలంక పర్యటన ముగించుకుంది. ఈ టూర్‌లో భాగంగా రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను భారత్ 1-0తో గెలిచింది. వన్‌డౌన్ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ రెండు టెస్టుల్లో కలిపి రెండు శతకాలు బాదాడు. మరోవైపు.. సిరాజ్ లంకతో టెస్టు సిరీస్‌లో రెండు వికెట్లు పడగొట్టాడు.

# సంపాదకీయం

## మంచు ముంపు ముప్పు!


హిమాలయాలు భారత ఉపఖండానికి సహజ రక్షణ కవచమే కాదు.. కోట్లాది ప్రజల జీవనానికి ఆధారమైన నదులకు జన్మస్థానం. కానీ ఇప్పుడు అదే హిమాలయాలు తీవ్రమైన హెచ్చరిక చేస్తున్నాయి. మంచు కరుగుతోంది.. హిమనదులు వెనక్కి జరుగుతున్నాయి. వాటిస్థానంలో కొత్త సరస్సులు కనిపిస్తున్నాయి. ఉన్న సరస్సులు విస్తరిస్తున్నాయి. ఈ భౌగోళిక మార్పు.. దిగువ ప్రాంత ప్రజల భద్రతకు ప్రమాద సంకేతం! సిక్కిం ప్రభుత్వం తాజాగా గుర్తించిన 40 అధిక ప్రమాదకర హిమ సరస్సులే ఇందుకు నిదర్శనం. వాటిలో 16 అత్యంత ప్రమాదకరమైన కేటగిరీ-ఎలో ఉండటం ఆందోళనకరం. హిమనదుల కరుగుదలతో హిమ సరస్సుల్లో నీటి నిల్వ పెరిగి, సహజ అడ్డుకట్టలు బలహీనపడితే ఒక్కసారిగా సరస్సు తెగిపోవచ్చు. భూకంపం, అధిక నీటి నిల్వ, మంచు లేదా రాళ్ల భారీ పతనం వంటి కారణాలూ ఈ విపత్తుకు ట్రిగ్గర్ కావచ్చు. ఒక్కసారిగా దిగువకు దూకే నీరు.. గ్రామాలు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర మౌలిక వసతులను తుడిచిపెట్టేస్తుందన్నది ఆగస్టు 26న నేపాల్-టిబెట్ సరిహద్దు సమీపంలోని భారీ ఆకస్మిక వరదతూ మరోసారి ప్రపంచం దృష్టికి తెచ్చింది. అది నేరుగా హిమ ఉత్పాతతం (గ్లోఫ్) కాకున్నా.. హిమాలయాల్లో మంచు, నీరు, భౌగోళిక నిర్మాణాల్లో వస్తున్న మార్పులు ఎంతటి ఆకస్మిక విపత్తులకు దారితీయగలవో గుర్తు చేసింది. 2023 అక్టోబరులో సిక్కింలో సంభవించిన గ్లోఫ్‌లో కనీసం 60మంది ప్రాణాలు కోల్పోయారు. మంగన్, గ్యాంగ్‌టక్, పాక్యాంగ్, నామ్చి జిల్లాల్లో భారీ నష్టం సంభవించింది. చుంగ్తాంగ్ డ్యామ్ ధ్వంసమైంది. అంటే ముప్పు కేవలం ప్రకృతికే పరిమితం కాదు.. మనిషి నిర్మించిన మౌలిక వసతులకూ, ఆర్థిక వ్యవస్థకూ విస్తరిస్తోంది. హిమనదుల కరుగుదలను వెంటనే ఆపడం సాధ్యం కాకున్నా.. ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి నష్టాన్ని నివారించడం సాధ్యమే. అందుకే సిక్కింలో గుర్తించిన ఈ 40 సరస్సులను ఒక రాష్ట్ర సమస్యగా కాకుండా.. మొత్తం హిమాలయ ప్రాంతానికి మోగుతున్న అప్రమత్తత గంటలుగా చూడాలి.

ఈ నేపథ్యంలో సిక్కిం ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ప్రాధాన్యమైనవి. రిమోట్ సెన్సింగ్, ఉపగ్రహ చిత్రాల ద్వారా హిమ సరస్సుల్లో వస్తున్న మార్పులను పర్యవేక్షించడం, నీటి మట్టం-ప్రవాహాన్ని కొలవడం, జియోఫిజికల్ సర్వేలు, ఎలక్ట్రికల్ రెసిస్టివిటీ టోమోగ్రఫీ, డిఫరెన్షియల్ జీపీఎస్, బాతిమెట్రీ, వరద నమూనాలు, ప్రమాద అంచనాలు వంటి శాస్త్రీయ పద్ధతులను ఉపయోగించడం.. విపత్తును ముందుగానే అంచనావేసే విధానానికి మారాల్సిన అవసరాన్ని సూచిస్తోంది. ఫిబ్రవరి 2025లో సిక్కిం సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖను గ్లోఫ్ ప్రమాద అంచనా, నివారణ అధ్యయనాలకు నోడల్ శాఖగా నియమించడం సరైన అడుగు. దేశంలోనే తొలి ప్రత్యేక గ్లోఫ్ రిస్క్ మిటిగేషన్ ప్రోటోకాల్‌ను రూపొందించే ప్రయత్నం మరింత ముఖ్యమైనది. ప్రతి సరస్సుకు ఒకే పరిష్కారం పనిచేయదన్న వాస్తవాన్ని ప్రభుత్వం గుర్తించింది. అత్యంత ప్రమాదకరంగా గుర్తించిన షాకో చో సరస్సుకు సంబంధించిన డీపీఆర్‌ను జాతీయ విపత్తు నిర్వహణ సంస్థకు సమర్పించారు. ముకుతాంగ్ సమీపంలోని లొనాక్ కాంప్లెక్స్‌లో డోల్మా సాంపా వద్ద వరద నిల్వ నిర్మాణానికి కేంద్ర జల సంఘం, సిక్కిం ప్రభుత్వం కలిసి డీపీఆర్ సిద్ధం చేస్తున్నాయి. గురుడోంగ్‌మార్ కాంప్లెక్స్‌లో సరస్సు అవుట్‌లెట్ వద్ద మోరైన్ ప్లగ్ గోడ నిర్మాణాన్ని ప్రతిపాదించారు. అయితే శాస్త్రవేత్తలు ప్రమాదాన్ని గుర్తించినా.. ఉపగ్రహాలు మార్పులను చూపించినా.. ఆ సమాచారం ప్రమాదంలో ఉన్న ప్రజలకు సమయానికి చేరకపోతే మొత్తం వ్యవస్థ అసంపూర్ణమే. అందుకే మీడియా అవగాహన కార్యక్రమాలకు ఇచ్చిన ప్రాధాన్యం కీలకం. గ్లోఫ్‌వంటి సంక్లిష్టమైన శాస్త్రీయ అంశాలను ప్రజలకు అర్థమయ్యే భాషలో వివరించడం, పుకార్లకు తావులేకుండా ధృవీకరించిన సమాచారాన్ని అందించడం, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలపై అవగాహన కల్పించడం అత్యవసరం. కొండ ప్రాంతాల్లోని గ్రామాలకు సురక్షిత ప్రాంతాలు, అత్యవసర తరలింపు మార్గాలు, హెచ్చరిక సంకేతాలు, స్థానిక వాలంటీర్ వ్యవస్థలుండాలి. పాఠశాలలు, స్థానిక సంస్థలు, పోలీసులు, విపత్తు నిర్వహణ సంస్థలు, మీడియా.. ఒకే సమాచార వ్యవస్థలో భాగస్వాములు కావాలి. ఎందుకంటే గ్లోఫ్‌కు స్పందించడానికి మనకు లభించే సమయం గంటలు కాకపోవచ్చు.. కొన్ని సందర్భాల్లో నిమిషాలే కావచ్చు!

అయితే ఈ సమస్యను సిక్కిం లేదా నేపాల్‌కు పరిమితమైన స్థానిక విపత్తుగా చూడటం ప్రమాదకరం. హిమాలయ పర్యావరణ వ్యవస్థలో మార్పులు దేశంలోని నదీ వ్యవస్థలు, నీటి భద్రత, జలవిద్యుదుత్పత్తి, వ్యవసాయం, పర్యాటకం, కోట్లాది ప్రజల జీవనంపై ప్రభావం చూపగలవు. హిమనదులు కరుగుతున్నప్పుడు ఒకవైపు తాత్కాలికంగా నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉండగా.. దీర్ఘకాలంలో హిమనదుల పరిమాణం తగ్గితే నదుల సహజ నీటి నిల్వ సామర్థ్యం కూడా ప్రభావితమవుతుంది. మరోవైపు హిమ సరస్సుల విస్తరణ ఆకస్మిక వరదల ప్రమాదాన్ని పెంచుతోంది. అంటే భవిష్యత్తులో ఒకేసారి అధిక నీరు, నీటి కొరత అనే రెండు విరుద్ధ పరిస్థితులను ఎదుర్కొనే అవకాశముంది. అందుకే హిమాలయాలపై విడివిడిగా కాకుండా సమగ్ర దృష్టి అవసరం. భారత్, నేపాల్, భూటాన్‌వంటి హిమాలయ దేశాల మధ్య శాస్త్రీయ సమాచార భాగస్వామ్యం, ఉపగ్రహ పరిశీలన, రియల్‌టైమ్ మానిటరింగ్, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు మరింత బలోపేతం కావాలి. హిమ సరస్సులపై జాతీయ స్థాయి డిజిటల్ రిజిస్టర్, ప్రమాద మ్యాపింగ్, అత్యవసర తరలింపు ప్రణాళికలు రూపొందించాలి. కొత్త రహదారులు, వంతెనలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు, పట్టణాలను నిర్మించే ముందు గ్లోఫ్ ప్రమాదాన్నీ ప్రాథమిక ప్రమాణంగా పరిగణించాలి. అభివృద్ధి అవసరమే.. కానీ హిమాలయాల భౌగోళిక పరిమితులను పట్టించుకోని అభివృద్ధి చివరకు విపత్తుగా మారొచ్చు. వాతావరణ మార్పు గురించి ప్రపంచస్థాయిలో చర్చిస్తున్న సమయంలో.. దాని ప్రత్యక్ష ప్రభావం హిమాలయాల్లో కనిపిస్తుండటం మనకు హెచ్చరిక. విపత్తు సంభవించిన తర్వాత నష్టపరిహారం ఇవ్వడం కంటే.. అది సంభవించే అవకాశాన్ని ముందుగానే గుర్తించి పెట్టుబడి పెట్టడం తెలివైన పాలన. సిక్కింలోని 40 సరస్సులు అందిస్తున్న సందేశమిదే. హిమాలయాలు మనకు నీటిని ఇస్తున్నంతకాలం వాటిని కేవలం వనరుల నిల్వగా చూడకూడదు, సున్నితమైన జీవవ్యవస్థగా సంరక్షించాలి. శాస్త్రం హెచ్చరిస్తే విధానాలు మారాలి. ఉపగ్రహాలు ప్రమాదాన్ని ముందే చూపిస్తే ప్రభుత్వాలు ముందుగానే మేల్కొనాలి. హెచ్చరికలు వస్తే ప్రజలకు చేరాలి. లేకపోతే మంచు కరిగే శబ్దం వినిపించేలోపే.. దిగువ లోయల్లో వరద గర్జన వినిపించొచ్చు. హిమాలయాల మౌనం ఇప్పుడు మౌనం కాదు, అది భవిష్యత్తు విపత్తులకు ముందస్తు హెచ్చరిక!!

# సీఈవో నుంచి వాటర్‌మ్యాన్ వరకూ..

**ఒకప్పుడు సాంకేతికతతో రాష్ట్ర భవిష్యత్తును ఆవిష్కరించిన నాయకుడు.. ఇప్పుడు నీటితో నవ్యాంధ్ర ప్రగతికి కొత్త బాటలు వేస్తున్నాడు. సీఈఓ సీఎంగా ప్రపంచాన్ని ఆకర్షించిన చంద్రబాబు.. వాటర్‌మ్యాన్‌గా కరవు నేలల దాహం తీర్చే దిశగా అడుగులేస్తున్నాడు. మూడు దశాబ్దాల క్రితం వేసిన వెలిగొండ విత్తనం నుంచి.. నేడు ప్రవహిస్తున్న పోలవరం జలధార వరకు సాగిన ప్రయాణం.. ఒక రాజకీయ పరిణామానికి ప్రతీక. అభివృద్ధి నిర్వచనం మారుతున్న వేళ.. చంద్రబాబు కొత్త ఇన్నింగ్స్‌లో నీరే కొత్త అధ్యాయంగా మారుతోంది.**





ఒక నాయకుడి రాజకీయ ప్రస్థానాన్ని పదవుల కాలంతో మాత్రమే కొలవలేం. కొందరు నాయకుల ప్రయాణం వారు పనిచేసిన కాలాన్ని దాటి.. తాము పాలించిన రాష్ట్ర భవిష్యత్తుతో ముడిపడి ఉంటుంది. నారా చంద్రబాబు నాయుడు రాజకీయ జీవితాన్నీ ఈ కోణంలోనే చూడాల్సి ఉంటుంది. ఒక దశలో సమాచార సాంకేతికత, పెట్టుబడులు, పట్టణ మౌలిక వసతులు, ప్రపంచస్థాయి సంస్థలను ఆకర్షించడంవంటి అంశాలతో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న ఆయనను 'సీఈఓ సీఎం'గా పిలిచారు. అభివృద్ధి అంటే ప్రభుత్వ కార్యాలయాలు, రహదారులు, సాగునీటి కాలువలకే పరిమితం కాకుండా.. సాంకేతికత, జ్ఞానం, పెట్టుబడులు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానం కావాలని ఆ రోజుల్లోనే ఆయన బలంగా వాదించారు. హైదరాబాద్ అభివృద్ధి కథలో ఆయన పాత్రను ఈ నేపథ్యంలోనే చూస్తారు. ఇప్పుడు ఆయన రాజకీయ ప్రయాణం మరో మలుపులో ఉంది. ఈసారి చర్చ సాఫ్ట్‌వేర్ కంపెనీల గురించి కాదు.. కాలువల్లో ప్రవహించే జలాల గురించి. డేటా సెంటర్ల గురించి కాదు.. చెరువులు, సాగునీటి ప్రాజెక్టుల గురించి. నగరాల అభివృద్ధి గురించి మాత్రమే కాదు.. కరవు నేలల్లో పంటల పచ్చదనం గురించి. ఇటీవల ఒకే వారంలో పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా నీటిని విడుదల చేయడం, దశాబ్దాల క్రితం తాను శంకుస్థాపన చేసిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు తొలి దశను ప్రారంభించడం ఈ మార్పుకు బలమైన సంకేతాలుగా కనిపిస్తున్నాయి. 1996లో శంకుస్థాపన చేసిన ప్రాజెక్టు దాదాపు మూడు దశాబ్దాల తర్వాత తొలి దశను పూర్తి చేసుకోవడం ఒక ప్రభుత్వ కార్యక్రమంకంటే పెద్ద కథ. ఒక రాజకీయ ఆలోచన ఎంత సుదీర్ఘకాలం ప్రయాణించి.. చివరకు ప్రజల జీవితాల్లోకి ప్రవేశిస్తుందో చెప్పే ఉదాహరణ.

చంద్రబాబు రాజకీయ ప్రస్థానంలో నీటి ప్రాధాన్యం ఇప్పుడే మొదలైనదేమీ కాదు. కుప్పం వంటి నీటి కొరత ఉన్న ప్రాంతంలో వ్యవసాయాన్ని మార్చేందుకు సూక్ష్మ సేద్యం, ఉద్యాన పంటలు, పాడి, పట్టువంటి అనుబంధ రంగాలను ప్రోత్సహించడం ద్వారా ప్రతి చుక్క నీటికీ విలువ కల్పించే ప్రయత్నం అప్పట్లోనే కనిపించింది. తక్కువ నీటితో ఎక్కువ ఉత్పత్తి సాధించాలనే ఆలోచన.. రైతు ఆదాయాన్ని కేవలం సంప్రదాయ పంటలపై ఆధారపడకుండా విస్తరించాలనే ఆలోచనకు దారితీసింది. తర్వాత కాలంలో పట్టిసీమ ద్వారా గోదావరి-కృష్ణా నదులను అనుసంధానించే ప్రయత్నం జరిగింది. అది కేవలం ఒక లిఫ్ట్ ఇరిగేషన్ పథకం కాదు.. రాష్ట్రంలో నీటి లభ్యతను ప్రాంతాల మధ్య సమతుల్యం చేయాలనే విస్తృత ఆలోచనకు ప్రతీక. ఇప్పుడు ఆ దృష్టి మరింత విస్తరిస్తోంది. ఒకవైపు పోలవరంవంటి జాతీయ ప్రాధాన్యమున్న ప్రాజెక్టులు.. మరోవైపు వెలిగొండ వంటి కరవు ప్రాంతాలకు జీవనాడిగా నిలిచే ప్రాజెక్టులు.. ఇంకోవైపు చెరువులు, కాలువలు, చెక్‌డ్యామ్‌లు, ఫామ్ పాండ్లు, భూగర్భ జలాల రీచార్జ్ వంటి స్థానిక జల వనరులు.. ఇవన్నీ ఒకే సమగ్ర జల వ్యూహంలో భాగం కావాల్సిన అవసరం ఉంది. 2026 ఇరిగేషన్ క్యాలెండర్‌లో 36 ప్రాధాన్య ప్రాజెక్టులను గుర్తించి, సుమారు రూ.35,555 కోట్ల అంచనా వ్యయంతో వాటికి లక్ష్యాలు నిర్దేశించడం ఈ దిశలో ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది. జల సంరక్షణ పనులను కూడా పెద్ద ప్రాజెక్టులకు సమాంతరంగా తీసుకెళ్లాల్సి ఉంది. ఎందుకంటే నదుల నుంచి నీటిని తెచ్చి కాలువలో వదిలేయడం ఒక దశ మాత్రమే. ఆ నీటిని పొలానికి చేర్చడం, భూమిలో నిల్వ చేయడం, వృథాను తగ్గించడం, పంట ఉత్పాదకతను పెంచడం, రైతు ఆదాయంగా మార్చడం.. మొత్తం ప్రక్రియలో భాగం కావాలి. అందుకే నీటి ప్రాజెక్టుల విజయాన్ని కాంక్రీట్ నిర్మాణాలతో కాకుండా.. నీటి చివరి వినియోగంతో కొలిచే సమయం వచ్చింది.

ఇక్కడే 'సీఈఓ సీఎంనుంచి వాటర్‌మ్యాన్' అనే పరిణామానికి అసలు అర్థం కనిపిస్తుంది. ఇది ఒక ఇమేజ్‌ను మరో ఇమేజ్‌తో భర్తీ చేయడం కాదు. రాష్ట్ర అభివృద్ధి అవసరాలు మారుతున్నకొద్దీ ఒక నాయకుడి ప్రాధాన్యాలు ఎలా మారవచ్చో చూపించే రాజకీయ ప్రయాణం. ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు అంటే సాంకేతికత, పెట్టుబడులు, పరిశ్రమలు, సేవారంగం అని చెప్పాల్సి వచ్చింది. ఇప్పుడు ఆ భవిష్యత్తుకు మరో మూలస్తంభం నీరు. రాష్ట్రంలోని కరవు ప్రాంతాలను స్థిరమైన సాగు ప్రాంతాలుగా మార్చడం, వ్యవసాయానికి నీటి భద్రత కల్పించడం, రైతుకు పంటల వైవిధ్యానికి అవకాశం ఇవ్వడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం.. ఇవన్నీ నీటితోనే ముడిపడి ఉన్నాయి. అందుకే వెలిగొండ గేట్లు తెరవడం లేదా పోలవరం కాలువలో నీరు ప్రవహించడం ఒక ఫోటో ఆపర్చునిటీగా ముగియకూడదు. అది నీటి పాలనలో కొత్త సంస్కృతికి ఆరంభం కావాలి. ప్రాజెక్టు ఎప్పుడు మొదలైంది? ఎవరు శంకుస్థాపన చేశారు? ఎవరి హయాంలో ఎంత పని జరిగింది అనే రాజకీయ వాదోపవాదాల కంటే.. చివరకు ఎంత ఆయకట్టుకు నీరు చేరిందన్నదే ప్రజల దృష్టిలో నిలవాలి. నీరు వచ్చిన తర్వాత రైతు ఏ పంట వేస్తున్నాడు? అతని ఆదాయం ఎంత పెరిగింది? వలస తగ్గిందా? గ్రామంలో కొత్త ఉపాధి ఏర్పడిందా? ఆ ప్రాంతంలో పెట్టుబడులు వచ్చాయా? ఇవే అసలు ప్రశ్నలు. మూడు దశాబ్దాల క్రితం వేసిన ఒక ప్రాజెక్టు విత్తనం ఇప్పుడు నీటి ఫలితంగా మారుతున్నట్లయితే.. ఆ ఫలితాన్ని మరింత విస్తరించడం తదుపరి బాధ్యత. ఎందుకంటే రాజకీయ వారసత్వం ప్రసంగాలతో కాదు.. తరతరాల జీవితాల్లో మిగిలే మార్పుతో నిర్మితమవుతుంది. ఆ మార్పులో నీరు ఒక శాశ్వత ముద్ర వేయగలిగితే.. 'సీఈఓ సీఎం'గా నిలిచిన చంద్రబాబు ప్రస్థానంలో 'వాటర్‌మ్యాన్' అనే అధ్యాయం మరింత బలమైన అర్థాన్ని సంతరించుకుంటుంది.

**(ఇంకావుంది.. 'నీటితో కొత్త అభివృద్ధి చరిత్ర')** ▪

## పనికొచ్చే పలుకు




## మొదలుపెడితే.. అదే తెలుస్తుంది!


పూర్తి సమాచారం తెలుసుకున్నాకే.. పని మొదలు పెడదామన్న ఆలోచన.. చాలామందిని అడుగు ముందుకు వేయకుండా ఆపుతుంది. అన్ని వివరాలు తెలిసే వరకు ఆగడం కంటే, ఉన్న అవగాహనతో పని ప్రారంభించి.. ఆ క్రమంలో నేర్చుకోవడమే అసలైన పురోగతి. ఈ ఒక్క ఆలోచనా మార్పు, జీవితంలో ఎన్నో అవకాశాలను చేజిక్కించుకోవడానికి, ఎన్నో భయాలను అధిగమించడానికి దోహదపడుతుంది. అమెరికన్ పౌర హక్కుల నాయకుడు మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్‌కు విస్తృతంగా ఆపాదించే ఒక ప్రసిద్ధ మాట ఉంది: *Take the first step in faith. You don't have to see the whole staircase, just take the first step.* అంటే, విశ్వాసంతో మొదటి అడుగు వేయండి. మెట్ల మార్గం మొత్తం చూడాల్సిన అవసరం లేదు, కేవలం మొదటి మెట్టు తీసుకోండి చాలు అని. ఈ మాటల్లో ఉన్న సందేశం మాత్రం అమూల్యమైనది. చీకటిలో మెట్లు ఎక్కేటప్పుడు, వెలుతురు కేవలం తదుపరి మెట్టును మాత్రమే చూపించినా, ఆ ఒక్క మెట్టు సరిపోతుంది, పైకి చేరుకోవడానికి.

ఈ సూత్రం వెనుక ఉన్న మనస్తత్వశాస్త్రాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం. మనం ఏదైనా కొత్త పని ప్రారంభించాలనుకున్నప్పుడు, మెదడు సహజంగానే భవిష్యత్తులో ఎదురయ్యే అన్ని అడ్డంకులను ముందుగానే ఊహించి, వాటికి సమాధానాలు వెతకమని ఒత్తిడి తెస్తుంది. దీన్నే మనస్తత్వశాస్త్రంలో "అనాలిసిస్ పారాలిసిస్" అంటారు. -అతిగా విశ్లేషించడం వల్ల చర్య తీసుకోలేని స్థితి. అయితే, వాస్తవానికి చాలా సమాచారం, చాలా నైపుణ్యాలు మనం పని మొదలుపెట్టిన తర్వాతే, ఆచరణలో ఎదురయ్యే సవాళ్ల ద్వారానే వస్తాయి. పుస్తకాలు చదివి ఈత నేర్చుకోలేం, నీళ్లలో దిగితేనే అసలైన నేర్చుకోవడం మొదలవుతుంది.

జీవితానికి దీన్ని అన్వయించి చూస్తే, ఎంతోమంది విజయవంతమైన వ్యక్తులు తమ ప్రయాణాన్ని అసంపూర్ణ సమాచారంతోనే మొదలుపెట్టారన్న సత్యం స్పష్టమవుతుంది. ఒక వ్యాపారవేత్త తన ఉత్పత్తిని పరిపూర్ణం చేసిన తర్వాతే మార్కెట్లోకి తీసుకురావాలని ఎదురుచూస్తే, పోటీదారులు అప్పటికే ముందంజ వేసి ఉంటారు. ఒక రచయిత తన రచనలో ప్రతి పదాన్నీ సంపూర్ణం చేసిన తర్వాతే ప్రచురించాలని ఆలోచిస్తే, ఆ పుస్తకం ఎప్పటికీ వెలుగు చూడకపోవచ్చు. వాస్తవానికి, మొదటి డ్రాఫ్ట్ ఎప్పుడూ పరిపూర్ణంగా ఉండదు. రాస్తూ, సవరిస్తూ ఉంటేనే అది మెరుగవుతుంది.

ఈ సూత్రాన్ని నిత్యజీవితంలో ఎలా అన్వయించుకోవచ్చో పరిశీలిద్దాం. మొదటిది, "పరిపూర్ణత" కోసం ఎదురుచూడటం మానేసి, "ప్రారంభం" కోసం సిద్ధపడండి. మీకు 100 శాతం సమాచారం రావాల్సిన అవసరం లేదు, 20-30 శాతం అవగాహన సరిపోతుంది మొదటి అడుగు వేయడానికి. రెండోది, పెద్ద లక్ష్యాన్ని చిన్న చిన్న దశలుగా విభజించండి. మొత్తం మెట్ల మార్గాన్ని చూడాల్సిన అవసరం లేదు, కేవలం తదుపరి మెట్టు ఎక్కడుందో తెలిస్తే చాలు. మూడోది, తప్పులు చేయడాన్ని నేర్చుకునే ప్రక్రియలో భాగంగా చూడండి. ప్రతి తప్పు మీకు కొత్త సమాచారాన్ని ఇస్తుంది. అది ముందుగా పుస్తకాల్లో చదివి తెలుసుకోలేనిది. నాలుగోది, "సిద్ధంగా ఉన్నానా" అని అడగడం మానేసి, "మొదలుపెట్టగలనా" అని ప్రశ్నించుకోండి. ఈ చిన్న పద మార్పు మీ దృక్పథాన్నే మార్చేస్తుంది.

గుర్తుంచుకోండి - మెట్ల మార్గం మొత్తం చీకటిలో ఉన్నా, మీ కాలి దగ్గర వెలుతురుంటే అది సరిపోతుంది తదుపరి అడుగు వేయడానికి. అలా ఒక్కో అడుగూ వేస్తూ ముందుకు సాగితే, ఎప్పుడో ఒకప్పుడు మీరు పైకి చేరుకుంటారు. ఆగి ఆలోచించడం కంటే, కదులుతూ నేర్చుకోవడమే జీవితంలో నిజమైన పురోగతికి మార్గం!



మీ నైపుణ్యాలు ఎవరూ దోచుకోలేని గొప్ప ఆస్తులు. మీరు ఎంతటి సంక్లిష్ట సమస్యలను పరిష్కరించగలిగితే.. అన్ని ఎక్కువ అవకాశాలు మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తాయి. ఏదైనా సాధించగానే నేర్చుకోవడం ఆపేయకూడదు. మారుతున్న కాలానికి అనుగుణంగా నిరంతరం కొత్త విషయాలు నేర్చుకుంటూ, మిమ్మల్ని మీరు మెరుగుపరుచుకున్నప్పుడే సమాజంలో మీ విలువ ఎప్పటికీ తగ్గకుండా ఉంటుంది. నేర్చుకోవడం ఆగిపోయిన క్షణమే, మీ విలువ కూడా స్తంభించిపోతుంది. నిరంతరం ఎదగడమే, ఎప్పటికీ చెరిగిపోని మీ అసలైన ఆస్తి.

-మహాదేవ

## వింతల్లో వింతలు

### దాచినా.. దాగని నిజం!




లాస్ ఏంజెలిస్‌లోని మెరీనా డెల్ రేలో లంగరు వేసిన 150 మిలియన్ డాలర్ల సూపర్‌యాచ్, పేరు కప్పిపుచ్చినా స్థానికులు వెంటనే గుర్తుపట్టారు. 'హ్యారీ పాటర్' రచయిత్రి జేకే రౌలింగ్‌కు చెందిన 'సమ్సార' యాచ్‌ను, ఆమెపై నిరసనకారుల నుంచి తప్పించుకోవడానికే దాచినట్టు సమాచారం. 290 అడుగుల ఈ నౌకలో పూల్, సినిమా థియేటర్ ఉన్నాయి. 2023లో దీన్ని కొన్న రౌలింగ్ సంపద ఇప్పుడు 1.2 బిలియన్ డాలర్లు!

# ‘ఆ నలుగురు’ దర్శకుడి కొత్త ప్రయోగం!

## భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత పొడవైన టైటిల్‌తో సినిమా..



తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ దర్శకుడు చంద్ర సిద్ధార్థ్ మరో వినూత్న ప్రయోగంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ‘ఆ నలుగురు’, ‘మధుమాసం’, ‘అందరి బంధువయా’, ‘ఆటగదరా శివా’ వంటి వైవిధ్యమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన ఆయన, తాజాగా ‘ఈ పాట కోరినవారు నెమలిపాలెం నుండి రమ, జ్యోత్స్న, నందు, మురళి, కబీర్, ఢోల్ రవి మొదలగువారు’ అనే హై-కాన్సెప్ట్ సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రానికి దర్శకత్వం వహించారు. ‘ఎ ఫర్‌బిడెన్ రాగ ఫ్రమ్ ఎ ఫర్‌బిడెన్ సాగా’ అనేది దీనికి ఉప శీర్షిక. ఫిల్మోత్సవ్ బ్యానర్‌పై చంద్ర సిద్ధార్థ్ స్వయంగా నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ 18న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. వీశీజఅవం ఇది కేవలం సినిమా మాత్రమే కాదని, భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత పొడవైన టైటిల్‌తో వస్తున్న తొలి చిత్రమని యూనిట్ చెబుతోంది. ప్రముఖ దివంగత దర్శక-రచయిత మదన్ అందించిన కథతో ఈ సినిమా రూపొందింది. మదన్ తన చివరి రోజుల్లో ప్లాన్ చేసిన ఈ కథాంశంపై చంద్ర సిద్ధార్థ్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ఒకప్పుడు మదన్ అందించిన కథతోనే ‘ఆ నలుగురు’ వంటి క్లాసిక్ చిత్రాన్ని తీసిన చంద్ర సిద్ధార్థ్, ఇప్పుడు మరోసారి ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేశారు. ఈ చిత్ర కథాంశం అత్యంత ఆసక్తికరంగా సాగుతుంది. ప్రతిరోజూ రాత్రి సరిగ్గా పదిన్నర గంటలకు ఒక నిర్దిష్ట రేడియో స్టేషన్ నుంచి ఒకే పాట ప్రసారమవుతూ ఉంటుంది. ఆ పాటను నెమలిపాలెం నుండి రమ, జ్యోత్స్న, నందు, మురళి, కబీర్, ఢోల్ రవి మొదలగువారు కోరుతుంటారు. ఈ విభిన్నమైన కాన్సెప్ట్ ఆధారంగానే సినిమా టైటిల్‌ను పెట్టడం విశేషం. కేవలం వినోదం మాత్రమే కాకుండా, ఇది తెలుగు తెరపై వస్తున్న మొట్టమొదటి మిస్టరీ మ్యూజికల్ చిత్రం కావడం మరో ప్రత్యేకత. సౌండ్ థెరపీ, న్యూరోసైన్స్, బ్రెయిన్ మ్యాపింగ్, జ్ఞాపకాలు, మానవ మెదడుకు, ధ్వనికి మధ్య ఉన్న సంబంధం, అపరాధ భావన వంటి సరికొత్త అంశాలను మేళవించి దర్శకుడు ఈ మిస్టరీ కథనాన్ని తెరకెక్కించారు. ఈ చిత్రంతో హర్ష హీరోగా టాలీవుడ్‌కు పరిచయమవుతున్నారు. ఆయన సరసన అమైరా గోస్వామి కథానాయికగా నటిస్తుండగా, సుజనా రెడ్డి, ఇనాయా సుల్తానా, రవివర్మ అనిరుధ్ శ్రీవాస్తవ, అశోక్‌వర్ధన్, రేఖా నిరోషా, సన్నీ, గిరి తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. చిత్రంలో సంగీతానికి అత్యంత ప్రాధాన్యత ఉండటంతో జే రెక్స్ అందించిన బాణీలు సినిమాను మరో స్థాయికి తీసుకెళ్తాయని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ సినిమాకు కథ: మదన్, సంగీతం: జే రెక్స్, పాటలు: చంద్ర సిద్ధార్థ్, మాటలు: పులగం చిన్నారాయణ, ఆర్ట్: అంజి కొయ్యల, సినిమాటోగ్రఫీ: సామ్ సుప్రీత్, ఎడిటింగ్: బొబ్బిలి భానుప్రకాశ్, గిరిధర్, సహ నిర్మాతలు: అగస్త్య మంజు, సాగర్, మహి, సమర్పణ: వై.వి.సత్యనారాయణ రాజు అందించగా, స్క్రీన్ ప్లే మరియు దర్శకత్వంతో పాటు నిర్మాణ బాధ్యతలను చంద్ర సిద్ధార్థ్ స్వయంగా నిర్వర్తించారు. విభిన్నమైన కథాంశాలతో ప్రయోగాత్మక చిత్రాలను ఆదరించే తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఈ వినూత్న ప్రయత్నం ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో వేచి చూడాలి.



# 18 ఏళ్ల సినీ ప్రయాణం.. అభిమానులకు నాని స్పెషల్ ప్రామిస్, ‘ది ప్యారడైజ్’ క్లిప్ వైరల్

టాలీవుడ్‌లో ఎలాంటి సినీ బ్యాక్‌గ్రౌండ్ లేకుండా తన స్వశక్తితో ఎదిగి స్టార్ హీరోగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కథానాయకుల్లో నేచురల్ స్టార్ నాని ఒకరు. సహజమైన నటన, విభిన్నమైన కథల ఎంపిక, తనదైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. హీరోగా మాత్రమే కాకుండా నిర్మాతగానూ తన అభిరుచిని చాటుకుంటున్న నాని.. తాజాగా తన సినీ ప్రయాణంలో మరో కీలక మైలురాయిని పూర్తి చేసుకున్నారు. నాని సినీ రంగ ప్రవేశం చేసి తాజాగా 18 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఆయన అభిమానులు సోషల్ మీడియా వేదికగా ప్రత్యేక పోస్టులు, ఎడిట్స్, వీడియోలతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. నాని కెరీర్‌లోని కీలక చిత్రాలను గుర్తు చేసుకుంటూ.. ఆయన సాధించిన విజయాలను సెలబ్రేట్ చేశారు. ఎలాంటి గాడ్‌ఫాదర్ లేకుండా ఇండస్ట్రీలో అడుగుపెట్టి.. అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్ ప్రారంభించి, ఆ తర్వాత హీరోగా మారి నేచురల్ స్టార్‌గా ఎదిగిన నాని ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచింది. వరుస విజయాలతో పాటు వైవిధ్యమైన సినిమాలతో తనకంటూ ప్రత్యేకమైన మార్క్ క్రియేట్ చేసుకున్నారు. తన 18 ఏళ్ల సినీ ప్రయాణంపై నాని కూడా సోషల్ మీడియా ద్వారా స్పందించారు. 18 ఏళ్లు పూర్తవడంతో సినిమాల్లో తాను ఇప్పుడు పెద్దవాడినయ్యాననే భావనను సరదాగా వ్యక్తం చేశారు. సాధారణంగా 18 ఏళ్లు దాటితే అడల్ట్ అంటారు కదా.. అదే విధంగా టాలీవుడ్‌లో కూడా తనకు 18 ఏళ్ల వయసు వచ్చినట్లుగా నాని సరదాగా చెప్పుకొచ్చారు. అయితే ఈ సందర్భంగా ఆయన చేసిన మరో కామెంట్ అభిమానులను మరింతగా ఆకట్టుకుంది. ఇన్నేళ్లుగా తనపై అభిమానులు చూపిస్తున్న ప్రేమను ఎప్పటికీ తేలికగా తీసుకోనని నాని స్పష్టం చేశారు. తన కెరీర్‌లో అభిమానుల పాత్ర ఎంతో కీలకమనే విషయాన్ని నాని మరోసారి గుర్తు చేసుకున్నారు. తనపై ప్రేక్షకులు, అభిమానులు చూపిస్తున్న ప్రేమను తాను ఎప్పుడూ అలుసుగా తీసుకోలేదని.. భవిష్యత్తులోనూ తీసుకోనని ప్రామిస్ చేశారు. 18 ఏళ్ల కెరీర్‌ను పూర్తి చేసుకున్న సందర్భంగా నాని చేసిన ఈ మాటలు అభిమానులకు బాగా కనెక్ట్ అయ్యాయి. స్టార్ హీరోగా ఎదిగిన తర్వాత కూడా అభిమానుల ప్రేమకు ఇంత విలువ ఇస్తూ మాట్లాడటంతో సోషల్ మీడియాలో ఆయనపై ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ఇక తన 18 ఏళ్ల సినీ ప్రయాణానికి సంబంధించిన ఈ ప్రత్యేక సందర్భాన్ని నాని తన రాబోయే చిత్రం ‘ది ప్యారడైజ్’కు సంబంధించిన క్లిప్‌తో పంచుకోవడం మరింత ఆసక్తిని పెంచింది. సినిమా నుంచి షేర్ చేసిన ఈ క్లిప్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోంది.



# ‘లెనిన్’ హీరోయిన్‌కు మోహన్‌లాల్ సినిమా ఛాన్స్.. ‘ఆపరేషన్ గంగ’తో మాలీవుడ్ ఎంట్రీ!

ఈ ఏడాది టాలీవుడ్‌లో మంచి విజయాన్ని అందుకున్న సినిమాల్లో ‘లెనిన్’ కూడా ఒకటిగా నిలిచింది. అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన ఈ చిత్రం ఇద్దరి కెరీర్‌లోనూ కీలకంగా మారింది. చాలాకాలంగా సరైన సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న అఖిల్, భాగ్యశ్రీలకు ఈ సినిమా మంచి కంబ్యాక్‌ను అందించింది. ముఖ్యంగా ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే తన అందం, నటనతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ‘లెనిన్’ తర్వాత ఆమెకు టాలీవుడ్‌లో మరిన్ని అవకాశాలు వస్తాయని భావించిన సమయంలోనే ఈ బ్యూటీ మరో భారీ ప్రాజెక్ట్‌ను సొంతం చేసుకున్నారు. అది కూడా మాలీవుడ్ సీనియర్ స్టార్ హీరో మోహన్‌లాల్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం కావడం విశేషం. మోహన్‌లాల్ హీరోగా తెరకెక్కనున్న భారీ చిత్రం ‘ఆపరేషన్ గంగ’లో భాగ్యశ్రీ బోర్సే కీలక పాత్రలో నటించనున్నట్లు తాజాగా మేకర్స్ ప్రకటించారు.. ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం ద్వారా ఆమె మలయాళ సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టబోతున్నారు. ఇప్పటికే ‘లెనిన్’తో తెలుగు ప్రేక్షకుల్లో గుర్తింపు తెచ్చుకున్న భాగ్యశ్రీ.. ఇప్పుడు మోహన్‌లాల్ లాంటి సీనియర్ స్టార్‌తో కలిసి నటించే అవకాశం దక్కించుకోవడంతో ఆమె కెరీర్‌కు ఇది మరో కీలక మలుపుగా మారనుంది. అయితే సినిమాలో ఆమె పోషించబోయే పాత్రకు సంబంధించిన పూర్తి వివరాలను మాత్రం మేకర్స్ ఇంకా వెల్లడించలేదు. దీంతో మోహన్‌లాల్‌తో ఆమె స్క్రీన్ షేర్ చేసుకునే విధానం ఎలా ఉంటుంది? ఆమె పాత్ర కథలో ఎంత కీలకంగా ఉండబోతోంది? అనే ఆసక్తి నెలకొంది.

# ఇండస్ట్రీ మారాలంటే ప్రేక్షకులు మారాలి..

## ‘పెద్ది’ వివాదంపై తాప్సీ కామెంట్స్!



భారతీయ సినిమాలలో మహిళలను వస్తువులుగా చూపించడంపై నటి తాప్సీ పన్ను కీలక వ్యాఖ్యలు చేశారు. కేవలం దర్శక-నిర్మాతలు మాత్రమే కాకుండా, ప్రేక్షకులు కూడా ఈ ధోరణికి వ్యతిరేకంగా పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు. ‘పెద్ది’, ‘టాక్సిక్’ వంటి చిత్రాలపై వస్తున్న విమర్శల నేపథ్యంలో తాప్సీ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఒక ఇంటర్వ్యూలో తాప్సీ మాట్లాడుతూ.. ప్రేక్షకులు కోరుకుంటున్నదే మేము ఇస్తున్నాము అనే వాదనను చిత్ర పరిశ్రమ తరచుగా తెరపైకి తెస్తుందని చెప్పారు. జనాలు ఏది కోరుకుంటే అది ఇవ్వకపోతే డబ్బులు ఎలా వస్తాయని మేకర్స్ భావిస్తారని, ఈ ఆలోచనా విధానం వల్ల అసలు కళ, నైపుణ్యం వెనుకబడిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం నటులు, దర్శకులు మాత్రమే ఈ సమస్యను పరిష్కరించలేరని, సోషల్ మీడియాలో ప్రేక్షకులు వ్యవహరించే తీరు ఈ సంస్కృతి కొనసాగడానికి కారణమవుతోందని ఆమె విమర్శించారు. సినిమాల్లోని కొన్ని సన్నివేశాలపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ, కొందరు మాత్రం ఆ చిత్రాలలోని ఫోటోలను జూమ్ చేయడం, వీడియోలలో విచిత్రమైన కోణాలను ఉపయోగించి వైరల్ చేయడం వంటి పనులకు పాల్పడుతున్నారని తాప్సీ గుర్తుచేశారు. దీనివల్ల సోషల్ మీడియాలో అలాంటి కంటెంట్‌కు ఆదరణ ఉందని మేకర్స్‌కు సంకేతాలు వెళ్తున్నాయని చెప్పారు. కోవిడ్ మహమ్మారికి ముందు భారతీయ సినిమా మంచి పురోగతిని సాధించి ప్రపంచ స్థాయి చిత్రాలతో పోటీ పడిందని, అయితే ఇప్పుడు మళ్లీ పరిశ్రమ వెనకడుగు వేస్తోందని అభిప్రాయపడ్డారు. ఈ విషయమై చిత్రనిర్మాతలు చివరికి బాధ్యతంతా ప్రేక్షకులపైనే నెట్టేస్తారని, ఆ సమయంలో నటుల దగ్గర ఎలాంటి సమాధానం ఉండదని తాప్సీ వాపోయారు. ఈ పోరాటంలో నటులు ఒంటరివారైపోతారని, కేవలం ప్రేక్షకులు మాత్రమే తమకు సహాయం చేసి ఈ యుద్ధంలో గెలిపించగలరని ఆమె పేర్కొన్నారు. కాగా, రామ్ చరణ్ హీరోగా నటించిన ‘పెద్ది’ చిత్రంలో జాన్వీ కపూర్ పాత్రపై వచ్చిన విమర్శలు, యష్ చిత్రం ‘టాక్సిక్’ లో మహిళల చిత్రీకరణపై సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున చర్చ జరిగిన తరుణంలో తాప్సీ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com